
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 27.5
కనిష్ఠం 16.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 3 డిసెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	579.70 (282.1472)	44,006	44,006
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.58 (4.35)	879.08	260.19
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.3045)	640.62	702.43

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

పంచాయతీ సమరమే



- ముగిసిన రెండోవిడత నామినేషన్ల ఘట్టం
- మూడో విడతకు నేటి నుంచి నామినేషన్లు
- తొలి విడతలో పోటాపోటీతో ఉపసంహరణలకు నేతల ప్రయత్నాలు

గ్రామపంచాయతీ ఎన్నికల సమరం ఊపందుకుంది. జిల్లాలో రెండో విడతలో ఎన్నికలు జరిగే 282 గ్రామపంచాయతీల్లో సర్పంచ్, 2,418 వార్డు సభ్యుల పదవులకు మంగళవారంతో నామినేషన్ల స్వీకరణ ముగిసింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు క్లస్టర్ల వద్ద అభ్యర్థులు బారులుతీరి ఉండడంతో సాయంత్రం 5 గంటల తర్వాత కూడా నామినేషన్ పత్రాలను స్వీకరించారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

మూడో విడత ఎన్నికలు జరిగే దేవరకొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాలకు 269 గ్రామపంచాయతీలు, 2,206 వార్డు సభ్యుల స్థానాలకు బుధవారంనుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. మొదటి విడత ఎన్నికలు జరిగే నల్లగొండ, చండూరు డివిజన్లలోని పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు పోటాపోటీ ఉండడంతో ఒకే పార్టీ నుంచి బరిలో ఉండేందుకు సిద్ధమైన అభ్యర్థులను బుధవారం ఉపసంహరించేలా నేతలు తుదిప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా మొత్తం జిల్లాలో ఎన్నికల అన్ని పంచాయతీల్లో ఎన్నికల వాతావరణం నెలకొని సందడి కొనసాగుతోంది.


నేటి నుంచి మూడోవిడత నామినేషన్ల స్వీకరణ

జిల్లాలోని దేవరకొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లోని 269 గ్రామపంచాయతీలు, 2206 వార్డుసభ్యుల పదవులకు బుధవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందుకోసం మూడు, నాలుగు పంచాయతీలకు కలిపి ఒక క్లస్టర్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ క్లస్టర్ వద్ద అభ్యర్థులకు సహాయకారిగా ఉండేందుకు ఒక హెల్ప్‌డెస్క్‌ని సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఈడివిజన్‌లో మొత్తం 2,81,329 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఈ డివిజన్‌లో ఈ నెల 5వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ కొనసాగుతుండగా, 9వతేదీన నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. 17వ తేదీన పోలింగ్ జరుగుతుంది.

రెండోవిడత పంచాయతీల్లో ముగిసిన నామినేషన్లు

రెండోవిడతలో ఎన్నికలు జరిగే మిర్యాలగూడ డివిజన్‌లోని 10 మండలాలకు 282 గ్రామపంచాయతీలు, 2,418 వార్డు సభ్యుల పదవులకు పోటీపడే అభ్యర్థులు అధిక సంఖ్యలో మంగళవారం రాత్రి వరకు నామినేషన్లు దాఖలు చేశారు. పోటీచేసే అభ్యర్థులెవరికీ నామినేషన్ వేయలేకపోయామనే అసంతృప్తి ఉండకూడదనే ఉద్దేశ్యంతో సాయంత్రం 5గంటలకు గడువు ముగిసిన తర్వాత కూడా లైన్‌లో నిలుచున్న అభ్యర్థులందరి నామినేషన్ పత్రాలను అధికారులు స్వీకరించారు. భారీగా నామినేషన్లు దాఖలవడంతో ఈ డివిజన్‌లో పలు గ్రామాల్లో ఎన్నికలు రసవత్తరంగా కొనసాగనున్నాయి. మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలతోపాటు పాక్షికంగా నల్లగొండ నియోజకవర్గంలోని గ్రామాలు ఈ డివిజన్‌లో ఉన్నాయి. ఇక్కడ అన్ని పంచాయతీల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీ తలపడుతుందని చెబుతున్నారు. ఏకగ్రీవాలకు ప్రాధాన్యమిస్తోన్న గ్రామాల్లో నామినేషన్ల ఉపసంహరణ గడువు వరకు ఇందుకోసం ప్రయత్నాలు చేసే పరిస్థితి కనిపిస్తోంది.

బాబ్బాబూ.. తప్పుకోండి...




జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరిగే నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 14 మండలాల్లోని 318 గ్రామపంచాయతీలు, 2,870 వార్డులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. 318 సర్పంచ్ పదవులకు 1,950 నామినేషన్లు దాఖలు కావడం రాష్ట్రంలోనే రికార్డుగా చెబుతున్నారు. ఒక్కో సర్పంచ్ స్థానానికి సగటున ఆరుగురు అభ్యర్థులు...

- మిగతా 8వ పేజీలో...

ఏకగ్రీవాల దిశగా..

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తామంటున్న అభ్యర్థులు
- తీర్మాణాలు చేసుకుంటున్న గ్రామస్థులు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏకగ్రీవాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రచారాలు, తాయిళాలకు మద్యం, డబ్బులు పంపిణీ చేసే బదులు గ్రామాభివృద్ధికి ఆ నిధులు కేటాయిస్తామని అభ్యర్థులు ప్రకటిస్తుండడంతో గ్రామస్థులు ఏకగ్రీవం చేసుకుంటున్నారు. పోటీగా బరిలో నిలిచిన అభ్యర్థుల నామినేషన్లను ఉపసంహరించుకునేలా చేస్తున్నారు. ఆలేరు మండలం భైరాంనగర్ పంచాయతీకి కంపరా జు వెంకటేశ్వర్‌రాజు సర్పంచ్‌గా ఏక్రగీవం అయ్యారు. భువనగిరి మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి, వార్డు సభ్యులు ఏక్రగీవమయ్యారు. సర్పంచ్‌గా ఏకగ్రీవమైన కొలను రవికళారెడ్డి గ్రామాభివృద్ధికి రూ.27లక్షల విరాళంగా ప్రకటించారు. రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ నారపాక మాధవితోపాటు ఏడుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని బుడ్డారెడ్డిగూడెం, యలమోనిగూడెం గ్రామస్థులు తీర్మానాలు చేసుకున్నారు. బుడ్డారెడ్డిగూడెంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జరిగిన సమావేశంలో సిం గెం బాలకృష్ణను ఏకగ్రీవం చేసేందుకు నిర్ణయించారు. యలమోనిగూడెం వాడపల్లి వెంకన్నను సర్పంచ్‌గా ఎన్నుకునేందుకు తీర్మానించారు.

వరి కొయ్యల కాల్చివేతతో నష్టాలు

- జేడీఏ శ్రవణ్ కుమార్



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్ కుమార్

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక నష్టాలు జరుగుతాయని జేడీఏ శ్రవణ్ కుమార్ అన్నారు. మంగళవారం నల్లగొండ మండలం అన్నారెడ్డిగూడెం గ్రామంలో వరికొయ్యల కాల్చివేతతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చితే నేలపై భాగంలో ఉష్ణోగ్రత 200 నుంచి 300డిగ్రీల వరకు పెరిగి, నేలలోని పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. వరి గడ్డిలో సహజంగా ఉండే నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి మూలకాలు వాతావరణలో కలిసి పోతాయన్నారు. యాసంగిలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల నారుమడి యాజమాన్యంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల కంటే తగ్గినప్పుడు నారు ఎర్రగా మారి కొన్నిసార్లు ఎండిపోతుందన్నారు. దీనికి సాధారణంగా అందించే ఎరువులతోపాటు ప్రతీ రెండు గుంటల నారుమడికి రెండు క్వింటాళ్ల కోళ్ల ఎరువు, గొర్రెల ఎరువు, లేదంటే వర్మీకంపోస్టు వేయాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మండల ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి వార్డులో పురుషులు ఎందుకు?

- కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆగ్రహం

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రసూతి వార్డులో పురుషులు ఉండడం ఏమిటని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లాకేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. వార్డులో ఉన్న వారందరినీ వెంటనే బయటికి పంపాలన్నారు. మంగళవారం ఆమె నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీచేసి ఆస్పత్రిలోని ప్రసూతి, చిన్నపిల్లల వార్డు, ఐసీయూ తదితర వార్డుల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రసూతి వార్డులో పురుషులు ఉండడంతో ఆమె ఆగ్రహం వ్యక్తంచేస్తూ తక్షణమే అందరినీ బయటకు పంపించాలని, పురుషులను ప్రసూతి వార్డులోకి ఎందుకు అనుమతించారని డ్యూటీ డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ పై సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ప్రసవించిన మహిళలకు సహాయకులు ఎక్కువ మంది ఉంటే చిన్న పిల్లలకు ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని, అందువల్ల ఎక్కువ మంది ఉండకుండా, కేవలం ఒక్కరు మాత్రమే సహాయకులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డాక్టర్ వందన, డాక్టర్ నగేష్, తదితరులున్నారు.



జిల్లాకేంద్ర ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

లే అవుట్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

లే అవుట్ ప్రక్రియ పనులను నియమ నిబంధనలకు లోబడి పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ఆమె చాంబర్‌లో ఇరిగేషన్, మునిసిపల్, ఆర్అండ్‌బీ అధికారులు, తహసీల్దార్‌లతో లేఅవుట్లపై సమావేశం నిర్వహించారు. భూసేకరణ అనుమతులను జాగ్రత్తగా పరిశీలించాలని, అనధికార లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదన్నారు. గ్రామ పంచాయతీ, మునిసిపల్ అధికారులు ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకొని అత్యవసర కాల్వలు, ఫుల్ ట్యాంక్ లెవల్ పరిరక్షణపై రాజీపడకుండా, నీటి ముంపు ప్రమాదం లేకుండా మంజూరు చేయాలన్నారు. జిల్లా ఇరిగేషన్ అధికారి నాగార్జున, ఆర్అండ్‌బీ అధికారి శ్రీధర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ మసాబ్ అహ్మద్, డీటీసీపీవో కృష్ణవేణిపాల్గొన్నారు.

నామినేషన్ల అప్పీళ్ల పరిశీలన

గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా నల్లగొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్లపై వచ్చిన అప్పీళ్లను కలెక్టర్ ఇలాత్రిపాఠి మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పరిశీలించారు. నల్లగొండ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్లపై 19 అప్పీళ్లు రాగా, అప్పీళ్లను నిబంధనల ప్రకారం ఆర్‌వోల సమక్షంలో పరిశీలించి ఆర్డీవో రూపొందించిన జాబితాను తనిఖీ చేశారు. వచ్చిన 19 అప్పీళ్లలో 15 తిరస్కరణకు గురికాగా, నాలుగు అప్పీళ్లు అంగీకరించినట్లు ఆర్‌డీవో అశోక్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. చండూరు డివిజన్‌కు సంబంధించి నామినేషన్లపై మూడు అప్పీళ్లు రాగా, రెండు తిరస్కరణ అయ్యాయని, ఒకటి అంగీకరించినట్లు చండూరు ఆర్డీవో శ్రీదేవి తెలిపారు. ఆమెవెంట నల్లగొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల నివారణే లక్ష్యం

జిల్లాలో 42రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు : ఎస్పీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్ తదితరులు

నల్లగొండ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సైబర్ నేరాల నివారణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులు, విద్యార్థులతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో 42రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఈ నెల 2వ తేదీ నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు ప్రతీవారం ఒక ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమం చేపడుతామన్నారు. ఇందులో భాగంగానే తొలిరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో కళాశాల విద్యార్థులకు ఆన్‌లైన్ జూమ్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించామన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సైబర్ క్రైం ఎస్ఐ విష్ణు, టూటౌన్ ఎస్ఐ సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

డీసీసీ అధ్యక్షుడు పున్నాకైలాష్ నేతకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన



సీఎం నుంచి నియామక పత్రం అందుకుంటున్న పున్నా కైలాష్ నేత

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీనియర్‌నేతల సలహాలు, సూచనలతో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని నూతన డీసీసీ అధ్యక్షుడు పున్నాకైలాష్ నేతకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం సీఎంను కలిసిన కైలాష్‌కు ఈమేరకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్ష నియామకపత్రాన్ని సీఎం నుంచి అందుకున్నారు. సమావేశంలో కొత్త డీసీసీ అధ్యక్షులకు పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పలు సూచనలు చేశారని కైలాష్ తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో అందరి సమన్వయంతో వంద శాతం గెలుపు లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్లు వెల్లడించారు. ఓటు చోరీకి నిరసనగా ప్రతీ నియోజకవర్గం నుంచి 25వేల మందితో సంతకాల సేకరణ చేపట్టాలని, ప్రతీ బూత్ నుంచి కనీసం 100 మంది సంతకాలు సేకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 14న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా నుంచి 500 మంది వరకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, నేనావత్ బాలూనాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రౌడీషీటర్ల కదలికలపై

పోలీసుల నిఘా

- నల్లగొండ మండలంలో అర్ధరాత్రి ఎస్పీ తనిఖీలు



తనిఖీల్లో భాగంగా స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

స్థానిక సంస్థల ఎన్నికలకు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో గొడవలు, ఘర్షణకు దిగిన వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నల్లగొండ మండల పరిధిలోని ముషంపల్లిలో తనిఖీలు నిర్వహించారు. రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ రూరల్)

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్య తీసుకోవాలి



ఎంజీయూలో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

- అఖిల పక్షనేతల డిమాండ్

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంజీయూలో విద్యార్థుల డబ్బులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీటెక్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకుడు దుర్గప్రసాద్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్‌చేశారు. మంగళవారం ఎంజీయూలో బీటెక్ కళాశాల ప్రధాన గేట్ వద్ద విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా ఆయా సంఘా నేతలు మాట్లాడుతూ టాస్క్ పేరిట రూ.3లక్షల పైగా డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన డబ్బులతో శిక్షణ ఇవ్వకుండా మోసం చేశారన్నారు. తక్షణమే పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వ్యక్తిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, విధుల నుంచి తొలగించాలని డిమాండ్‌చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణే తమ లక్ష్యమని, విచారణ పూర్తి అయ్యే వరకూ ఆందోళన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు వాడపల్లి నవీన్, బీసీ సంఘం నాయకులు కరుణాకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు సురేష్, పీడీఎస్‌యూ నాయకులు హర్ష తదితరులు పాల్గొన్నారు. ...ర్యంలో రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కర్రెం రవికుమార్, గౌతమ్, శివ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి

పూలేవీ? పండ్లేవీ?

- గిట్టుబాటు కావడంలేదని దుకాణం మూసేసిన టెండర్‌దారుడు

లక్ష్మీనృసింహస్వామికి సమర్పించేందుకు పూలు, పండ్లు కరువయ్యాయి. కొండపై ఏర్పాటు చేసిన దుకాణదారుడు గిట్టుబాటు కావడంలేదని దుకాణం మూసివేయడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



భూసారాన్ని కాపాడుకుందాం

- వరి కొయ్యలను కాలుస్తున్నరైతులు
- వాతావరణానికి, భూమికి చేటు



నల్లగొండ మండలంలో దహన మవుతున్న వరి కొయ్యలు

అంగన్‌వాడీకి రాజీనామా...

సర్పంచ్‌గా బరిలోకి


జనగాం సుధారాణి

ఆలేరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):పంచాయతీ ఎన్నికల్లో నిలబడేందుకు అంగన్‌వాడీ టీచర్ తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో 20 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా జనగాం సుధారాణి పనిచేస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడతలో కొల్లూరు గ్రామం జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. దీంతో ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో ఉన్న సుధారాణి నెలకు రూ.15 వేలకు పైగా వేతనం వచ్చే ఉద్యోగానికి రాజీనామా చేసి సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేసింది. గ్రామసేవ లక్ష్యంతో సర్పంచ్ బరిలోకి దిగానని, ప్రజలు తనకే పట్టం కడతారని ఆశిస్తున్నట్లు సుధారాణి తెలిపింది.

ఓటరు లేడు.. ఎన్నికలెట్లా..

- మల్యాపూర్ 8వ వార్డుకు నామినేషన్ నిల్
- ఎస్టీలు లేని చోట రిజర్వు

తుర్కపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మల్యాపూర్ పంచాయతీలో 8వార్డుకు ఎన్నికలు జరిగే అవకాశం లేకుండాపోయింది. మొత్తం 8 వార్డులుండగా 8 వార్డు ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ అయింది. అయితే గ్రామంలో ఎస్టీ ఓటర్లు ఒక్కరూ లేరు. దీంతో ఈ వార్డుకు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. కాగా 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ వార్డు ఎస్టీకి రిజర్వ్ అయినట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రామపంచాయతీ పరిధిలో మల్యాపూర్‌తో పాటు బీల్యానాయక్‌తండా, బద్దుతండా గ్రామాలు ఉండేవి. 2018లో రెండు తండాలూ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. దీంతో సమస్య ఉత్పన్నం అయినట్లు అధికారులు తెలిపారు. ఈ వార్డులో ఇద్దరు ఎస్టీ ఓటర్లు ఉండగా ఇటీవల బీల్యానాయక్‌తండాకు తమ ఓట్లను మార్చుకున్నారు. దీంతో ఈ వార్డు సభ్యులు సర్పంచ్ అభ్యర్థులకు మాత్రమే ఓటు వేయనున్నారు.

అవకాశం దక్కలేదని ఆగ్రహం


వాహనంపై ఉన్న పార్టీ నాయకుడి చిత్రాన్ని తీసివేస్తున్న కార్యకర్త

మేళ్లచెర్వు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమైన ఆశావహుల్లో కొందరికి నిరాశే ఎదురవుతోంది. దీంతో నిన్నటి వరకు కొనసాగిన పార్టీపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం వేపలమాదారం గ్రామంలో సర్పంచ్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు అయ్యింది. అయితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బండ్ల జయరాజుకు అవకాశం ఇస్తామని పార్టీ నేతలు గతంలో హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ హామీని మరిచి వేరే వారిని పార్టీ తరుపున అభ్యర్థిగా ప్రకటించడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన జయరాజు అతడి ద్విచక్రవాహనంపై ఉన్న ప్రజాప్రతినిధి చిత్రపటానికి సంబంధించిన స్టిక్కర్‌ను తొలగించాడు. దాంతో పాటు పార్టీ కండువాలను నాయకులు కాల్చి ధ్వంసం చేశారు.

పోటీ చేసేలా చూడండి

మాడ్గులపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఓటు హక్కు కల్పించి, నామినేషన్ చెల్లుబాటు అయ్యేలా చూడాలని నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామానికి చెందిన చింతమల్ల కల్పన అలియాస్ ధరావత్ కల్పన మంగళవారం కలెక్టర్‌కు విన్నవించారు. ఇందుగుల గ్రామానికి చెందిన చింతమల్ల రాంప్రసాద్, త్రిపురారం మండలంలోని చౌళ్లతండాకు చెందిన ధరావత్ కల్పనలు రెండేళ్లకిందట ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. వీరికి ఒక పాప ఉంది. ఇందుగుల గ్రామంలో నల్లగొండ శాసనసభ నియోజకవర్గంలోని 252 పోలింగ్ స్టేషన్‌లో 951 క్రమ సంఖ్యలో తనకు ఓటు ఉందని, కానీ ఇందుగుల గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో నమోదు చేయలేదన్నారు. దీంతో హైకోర్టును ఇటీవల సంప్రదించగా ఖచ్చితంగా ఓటరు జాబితాలో ఓటును చేర్చాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో మంగళవారం ఇందుగుల గ్రామంలో నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. నామినేషన్ చెల్లుబాటు అయ్యేవిధంగా చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఇందుగుల ఎస్టీ మహిళకు రిజర్వ్ కావడంతో తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో చేసేదేమి లేక హైకోర్టును ఆశ్రయించామని, హైకోర్టు తీర్పు ఇవ్వడంతో నామినేషన్ దాఖలు చేశానన్నారు.

ఏకగ్రీవం దిశగా...

- పలుచోట్ల గ్రామసభలు నిర్వహించి ఏకగ్రీవాలకు తీర్మానం
- గ్రామాభివృద్ధికి తోడు ఆలయాల నిర్మాణాలకు విరాళాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటి విడతలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో పలుచోట్ల ఏకగ్రీవాల దిశగా అడుగులుపడుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు నేటితో గడువు ముగుస్తుండటంతో పాటు పలు చోట్ల ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది.


కంపరాజు వెంకటేశ్వర్‌రాజు

ఆలేరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీగా ఏర్పడిన గ్రామానికి మొదటి సర్పంచ్ కావాలన్న తపన ఆయనకు అదృష్టంగా కలిసి వస్తోంది. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక శివారు గ్రామంలోని బైరాంనగర్, రాజానగరం గ్రామాలను కలిపి బైరాంనగర్ గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయగా మొదటిసారి ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి సర్పంచ్‌గా కావాలన్న తలంపుతో ఉన్న కంపరాజు వెంకటేశ్వర్‌రాజుకు ఆ అవకాశం వరించింది. ఇరుగ్రామాల పెద్దలు కూర్చుని సమన్వయంతో ఏకగ్రీవంగా చేసుకోవడంతో సఫలమయ్యారు. ప్రత్యర్థిగా బరిలో దిగిన నంద మహేందర్ తన నామినేషన్‌ను మంగళవారం ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ గ్రామపంచాయతీ ఏకగ్రీవం కానుంది. ఈ విషయమై రిటర్నింగ్ అధికారి మంజులను అడుగగా ఉపసంహరించుకున్నది వాస్తవమే అయినప్పటికీ బుధవారం అధికారిక ప్రకటన ఉంటుందన్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏకగ్రీవం కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆనందం నెలకొంది.

రామన్నపేట : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిదానపల్లిలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవం కానున్నారు. సర్పంచ్‌తో పాటు ఏడువార్డులకు నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. సర్పంచ్ పదవికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన నారపాక మాధవి యాదయ్య, వార్డు సభ్యులుగా చల్ల శిల్ప, కొండ శ్రీను, వర్కాల వినయ్, భాషమల్ల అనిత, కొండ అండాలు, కడారి ఐలయ్యలు ఒక్కొక్కటిగా నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.


గుర్రంపోడు మండలంలో రెండు సర్పంచ్ స్థానాలు..

గుర్రంపోడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుర్రంపోడు మండలంలో రెండు పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. బుడ్డారెడ్డిగూడెం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మంగళవారం నిర్వహించిన గ్రామసభలో సింగెం బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్థులు నిర్ణయించారు. జనరల్ స్థానం రిజర్వు కావడంతో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. బుడ్డారెడ్డిగూడెం, బోడపాడు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాల నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు రూ.25.20 లక్షలు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చిన సింగం బాలకృష్ణను ఏకగ్రీవంగా గ్రామసభలో తీర్మాణించినట్లు సమాచారం. యలమోనిగూడెం గ్రామంలో సర్పంచ్‌గా వాడపల్లి వెంకన్నను ఎన్నుకునేందుకు గ్రామస్థులు నిర్ణయించారు. గ్రామ ంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చు చేస్తానని ముందుకు వచ్చిన వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మాని ంచినట్లు తెలిసింది. మూడవ విడత ఈ నెల 3 నుంచి జరిగే నామినేషన్ ప్రక్రియలో గ్రామస్థుల నిర్ణయం మేరకే నామినేషన్లు దాఖలు కానున్నాయి. ఈమేరకు సామాజిక మాధ్యమాల్లో ఏకగ్రీవాలు వైరల్‌గా మారాయి.

రామచంద్రాపురంలో రెండోసారి..

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)

యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి, వార్డుసభ్యులు ఏకగ్రీవం కానున్నారు. రెండో విడతలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అయితే సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్, 8 వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలయ్యాయి. ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం ఇచ్చే నజరానాను గ్రామ అభివృద్ధికి వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో 2018 ఎన్నికల్లో బీసీ జనరల్ రిజర్వేషన్ కావడంతో భువనగిరి శ్రీనివాస్ గౌడ్‌ను సర్పంచ్‌గా, 8మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా ప్రస్తుతం జనరల్ మహిళకు రిజర్వ్‌డ్ కావడంతో గ్రామస్థులు, కుల పెద్దలు సమావేశమై తీర్మానించి కొలను రవికళారెడ్డిని ఏకగ్రీవం చేసేందుకు యత్నించారు. దీంతో ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. అధికారులు అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. గతంలో 2018లో ఏకగ్రీవంగా ఎన్నికైన భువనగిరి శ్రీనివాస్ గౌడ్ 20గుంటల భూమి విరాళమివ్వడంతో ఆ స్థలంలో గ్రామస్థులు శ్మశానవాటికను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం సర్పంచ్‌గా ఏకగ్రీవం కాబోతున్న కొలను రవికళారెడ్డి గ్రామాభివృద్ధికి రూ.27లక్షల విరాళంగా ప్రకటించారు. అయితే ప్రభుత్వం అందజేస్తున్న ఏకగ్రీవ నజరానా, సర్పంచ్ ఇస్తున్న విరాళంతో తమ గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధికి నోచుకుంటుందని గ్రామస్థులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఉపసర్పంచ్‌గా సుర్పంగ చందు పేరును గ్రామస్థులు ప్రతిపాదించారు.



నాలుగు పర్యాయాలు సర్పంచ్‌గా సేవలు

- 15 ఏళ్ల పాటు బీ వెల్లెంల సేవలో రాంరెడ్డి


కోమటిరెడ్డి రాంరెడ్డి

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి సర్పంచ్‌గా కోమటిరెడ్డి రాంరెడ్డి నాలుగు పర్యాయలు సేవలు అందించారు. టెక్స్‌మో రాంరెడ్డిగా సుపరిచితులైన ఆయన జిల్లా మంత్రి, ఇదే గ్రామానికి చెందిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి కుటుంబానికి సమీప బంధువు. కాంగ్రెస్ పార్టీ తరఫునే నాలుగు పర్యాయాలు సర్పంచ్‌గా గెలిచి గ్రామానికి సేవలందించారు. నేటికీ ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. 1982లో మొదటిసారి సర్పంచ్ పదవిని చేపట్టిన ఆయన 1997వరకు 15 ఏళ్ల పాటు గెలిచి కొనసాగారు. అనంతరం పంచాయతీలకు రిజర్వేషన్ వ్యవస్థ రావడంతో బీసీలకు రిజర్వ్ అయ్యింది. దీంతో పోటీ చేయలేకపోయారు. అనంతరం మళ్లీ జనరల్‌కు రిజర్వు కావడంతో 2002-2007 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఆయనను పలకరించగా అప్పటి ఎన్నికల తీరును గుర్తుచేశారు. అప్పటి ఎన్నికల్లో ఓటర్లైనా, రాజకీయ నాయకులైనా నైతిక విలువలకు కట్టుబడేవారని చెప్పారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. సర్పంచ్‌గా రెండో పర్యాయం వరకు ఒక్క వార్డుకు కూడా మహిళా సభ్యులు లేరన్నారు. సేవ చేయగలిగే సామర్థ్యం ఒకటే చూసేవారని ఇపుడు డబ్బు, మద్యం పంచనిదే ఓట్లు వేయనిస్థితికి కాలం మారిపోవడం బాధాకరమన్నారు. తాను సర్పంచ్‌గా పనిచేసిన సమయంలోనే ఇపుడున్న గ్రామపంచాయతీ భవనాన్ని, ఉన్నత పాఠశాలను నిర్మించానని, కంచనపల్లి నుంచి బీ.వెల్లెంల వరకు రోడ్డును వేయించానన్నారు. సుమారు 18 ఎకరాల భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయించానని రాంరెడ్డి గుర్తుచేశారు.

గుర్తుంచుకునేలా..

- ఆకర్షణీయంగా ఎన్నికల గుర్తులతో బ్యానర్లు, బ్యాడ్జీలు, స్టిక్కర్లు





నల్లగొండలోని ఓ దుకాణంలో ఎన్నికల గుర్తులతో కూడిన సామాగ్రి



పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఉండరు. ఈ నేపథ్యంలో వివిధ ఆకారాల్లోని వాటిని గుర్తులుగా కేటాయిస్తుంటారు. దీంతో ఓటర్లు ఇట్టే గుర్తులను గుర్తుంచుకునేలా అభ్యర్థుల కోసం బ్యానర్లు, స్టిక్కర్లు, బ్యాడ్జీలను వ్యాపారులు సిద్ధం చేశారు. మొదటి విడతలో బుధవారం గుర్తుల కేటాయింపుతో వీటికి గిరాకీ రానుంది. వివిధ రంగుల్లో ఆకర్షణీయంగా వాటిని తయారు చేశారు.

ఫొటో : నల్లగొండ స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సీఎం సభకు వెళ్లి వస్తూ చెట్టును ఢీకొన్న కారు

- ముగ్గురు ఏఎస్ఐలు, ఒక హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

గుర్రంపోడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్ వద్ద సీఎం సభకు వెళ్లి వస్తున్న పోలీసు వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో పలువురు పోలీసులు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీఎం సభ బందోబస్తుకు వెళ్లి విధులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని తానేదార్‌పల్లి(జువ్వగూడెం) వద్దకు రాగానే సోమవారం రాత్రి అదుపుతప్పిన పోలీస్ వాహనం చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో నల్లగొండ టూటౌన్‌లు ఏఎస్ఐలు నర్సింహారెడ్డి, శ్రీధర్, సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయని గుర్రంపోడు ఎస్ఐ మధు తెలిపారు. నల్లగొండ ఆసుపత్రిలో చికిత్స వారు చికిత్స పొందుతున్నారని ఎస్ఐ తెలిపారు. గాయపడిన సిబ్బందిని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరు..

చివ్వెంల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బండమీదిచందుపట్లలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆత్మకూరు(ఎస్) మండలం దాచారం గ్రామానికి చెందిన నవీన్ స్వగ్రామం నుంచి ఖమ్మం వెళ్తున్నాడు. ఆ క్రమంలో చందుపట్ల వద్దకు రాగానే అతివేగంతో స్కూటీ వాహనం నడుపుతూ సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై డివైడర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. నవీన్ మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.


నల్లగొండలో చికిత్స పొందుతున్న పోలీసులను పరామర్శిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్

చదువు ఇష్టంలేక

కేజీబీవీ ప్రహరీ దూకి ..

- వెతికి పట్టుకున్న పోలీసులు
- తల్లిదండ్రులకు అప్పగింత

మునుగోడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మునుగోడు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల(కేజీబీవీ) నుంచి పారిపోయిన బాలిక ఆచూకీ పోలీసులకు లభ్యమైంది. వెంటనే ఆ బాలికను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలిక ఆదివారం సాయంత్రం భోజన సమయంలో పాఠశాల ప్రహరీ పైనుంచి దూకి తప్పించుకుంది. ఈ మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పాఠశాల ప్రత్యేకాధికారి(ఎస్‌వో) పుష్పలత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించి ఎస్ఐ రవి ప్రత్యేక బృందంతో గాలింపు చేపట్టారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి చేరుకున్న తర్వాత ప్రయాణికుల ఆటోలో నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి బాలికను అదుపులోకి తీసుకుని మంగళవారం సఖీ కేంద్రానికి తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ రవి తెలిపారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చదువంటే ఇష్టం లేకనే పారిపోయినట్లు బాలిక చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా బాలిక పారిపోయిన వ్యవహారంపై వెంటనే స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆమె ఆదేశాల ప్రకారం డీఈవో బిక్షపతి పాఠశాలను సందర్శించి విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ప్రకారం ఎస్‌వోను విధుల నుంచి తొలగించటంతో పాటు విధుల్లో సీఆర్టీలకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కిడ్నాప్ వ్యవహారంలో కొనసాగుతున్న దర్యాప్తు

తిప్పర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం యల్లమ్మగూడెం గ్రామంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి భర్త కిడ్నాప్ వ్యవహారంపై మంగళవారం ఉదయం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కిడ్నాప్ చేసిన వారిపై మూడు రోజులుగా కేసు నమోదు చేయకుండా, అరెస్ట్ చేయకుండా ఉంటున్నారని బాధితులు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి సోమవారం ఫిర్యాదుచేశారు. ఈ మేరకు శాలిగౌరారం సీఐ కె.కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బాధితుడిని కలిసి విచారణ చేస్తున్నారు. అతడిని ఎక్కడ నుంచి తీసుకెళ్లారు, కిడ్నాప్ చేసిన సమయంలో ఎంతమంది పాల్గొన్నారు. ఏ ప్రదేశంలో ఇబ్బందులకు గురిచేశారు అనే విషయాలను బాధితుడి ద్వారా అడిగి తెలుసుకుంటున్నారు. విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ కొండల్‌రెడ్డి తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి


తాటిచెట్టు పైనుంచి పడిన యాదయ్య

తిరుమలగిరి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. వెలిశాల గ్రామానికి చెందిన చీకటి యాదయ్య(60) శనివారం తాటి చెట్టు పైనుంచి కాలుజారిపడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు యాదయ్య భార్య సుశీల తెలిపారు. గీత కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి చిత్తలూరి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు.

350 క్వింటాళ్ల నల్లబెల్లం పొడర్ లారీ పట్టివేత


నల్లబెల్లం పొడర్‌ను తరలిస్తుండగా పట్టుకున్న లారీతో ఎక్సైజ్ అధికారులు

మోతె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనుమతుల్లేకుండా తరలిస్తున్న 350 క్వింటాళ్ల నల్లబెల్లం పౌడర్ లోడు లారీని పట్టుకున్నట్లు నల్లగొండ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్ తెలిపారు. మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అందిన సమాచారం మేరకు సూర్యాపేట ఎక్సైజ్ సిబ్బందితో కలిసి సూర్యాపేట జిల్లా మోతె మండలం సింగరేణిపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కేఏ 39 ఏ 2050 నెంబరు గల లారీ అతివేగంతో వెళ్తుండగా అనుమానంతో వెంబడించి పట్టుకున్నారు. లారీలో 1,167 పౌడర్ బస్తాల్లో 30 కిలోల చొప్పున 350.1 క్వింటాళ్ల నల్లబెల్లం పౌడర్‌ను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ సరుకును తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా చినచోళీ తాలుకాకు చెందిన శ్యామ్, జగన్నాథ్‌లను అరెస్టుచేసి లారీని స్వాధీనం చేసుకున్నట్లు సంతోష్ తెలిపారు. దాడుల్లో సూర్యాపేట ఎక్సైజ్ సీఐ మల్లయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు గోపాల్‌రావు, శోభారాణి, సిబ్బంది అప్సర్, వనజ, గౌతమి, బ్రమ్మం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

వలిగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న మద్యాన్ని మంగళవారం సాయంత్రం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలో స్థానిక తొర్రూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన వాహనాన్ని తనిఖీచేశారు. ఆ వాహనంలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యాన్ని గుర్తించారు. రాయల్ స్టాక్ 2 లీటర్ల బాటిళ్లు 15, ఐబీ క్వార్టర్ బాటిళ్లు 48 ఉన్నట్లు గుర్తించారు. మొత్తం మద్యం 38.64లీటర్లు ఉండగా సుమారు రూ.42,504 విలువైనదిగా పోలీసులు తెలిపారు. బాటిళ్లతో పాటు వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాతృత్వం..

యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు మచ్చ నర్సింహాగౌడ్ అర్ధాకలితో అల్లాడుతున్న వానరాలకు అరటిపండ్లు అందిస్తున్నారు. రెండు రోజులుగా సుమారు 200 వానరాలకు అరటి పండ్లు అందజేశాడు. అదేవిధంగా గోశాలకు ఉచితంగా పశుగ్రాసం, పక్షులకు గింజలు, చీమలకు స్వీట్స్ అందజేసూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)



జనగామ జిల్లాలో

యాదాద్రి జిల్లా మహిళ మృతి


సుజాత మృతదేహం

లింగాలఘణపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల ఫ్లైఓవర్‌పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రిభువనగిరి జిల్లా మహిళ మృతి చెందింది. ఎస్ఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన కళ్లెపు సుజాత(40) కొంతకాలంగా జనగామలో నివాసముంటోంది. కాగా భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సుజాత పనులను ముగించుకుని మరో కార్మికుడు శీలం మోహన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జనగామకు బయలుదేరింది. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ సుజాతను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. మరో కార్మికుడు మోహన్ అనే వ్యక్తి గాయాలయ్యాయి. లింగాలఘణపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. మృతురాలికి కుటుంబ వివరాలు తెలియాల్సి ఉంది.

మనోధైర్యమే ఆయుధం

ఆంధ్రజ్యోతి జన వాక్యం

అంగవైకల్యాన్ని జయించి, మనోధైర్యంతో జీవన అవరోధాలను దాటుతున్న వజ్ర సంకల్పులు దివ్యాంగులు.. అందరితో సమానంగా పోటీపడుతూ అభివృద్ధికి అంగవైకల్యం అడ్డుకాదని నిరూపిస్తూ భవితకు బాటలు వేసుకుంటున్నారు. పరిపాలనలోనూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, పోటీ పరీక్షల్లోనూ రాణిస్తున్నారు. అయినా జీవన సమరపు గమనంలో అనేక ఆటుపోట్లకు గురవుతున్నారు. ఈ నెల 3వ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కొందరి మనోగతం ఇలా..

• (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

అడుగడుగునా వివక్షకు గురవుతున్నాం



దివ్యాంగులను కొంతమంది చిన్నచూపు చూస్తుండటంతో అడుగడుగునా వివక్షకు గురవుతున్నాం. చదువుకోవడానికి పాఠశాలకు వెళ్లినా తోటి విద్యార్థులు హేళన చేస్తున్నారు.రాజకీయం, చదువు, ఉద్యోగ విషయాల్లో అడుగడుగునా అన్నీ అడ్డంకులే ఎదురవుతున్నాయి. సమాజంలో వికలాంగులకు ప్రత్యేక స్థానం ప్రభుత్వం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- బుడిగె నాగరాజు, యాదగిరిగుట్ట


విజయం సాధిస్తాననే ధీమాతోనే..



ఎంఏ, బీఈడీ చేసినా ఇప్పటి వరకు ఉద్యోగావకాశం దక్కలేదు. దివ్యాంగుల కోటా ఉన్నప్పటికీ ఎంత ప్రయత్నం చేసినా నిరాశే మిగిలింది. ఉద్యోగం లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురయ్యాను. విద్యాభ్యాసం నుంచి అడుగడుగునా అవమానాలు ఎదురైనా ఫలితం దక్కలేదు. ఇప్పటి వరకు ఉద్యోగం వస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాను. ఎప్పటికైనా విజయం సాధిస్తానే ధీమాతో ముందుకు సాగుతున్నాను. ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించాలి.

-రాణి, సైదాపురం, యాదగిరిగుట్ట మండలం

నామినేటెడ్ పోస్టులు అమలు చేయాలి



ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు అన్ని రంగాల్లోనూ నామినేటెడ్ పోస్టులు అమలు చేయాలి. ప్రతీ దివ్యాంగుడికి రూ.4వేల పింఛన్ నుంచి 6వ వరకు పెంచుతూ ఆర్టీసీ బస్సుల్లో 50శాతం రవాణాకు కాకుండ మహిళలకు ఏవిధంగా ఉచితం ప్రయాణం చేస్తున్నారో అదేవిధంగా దివ్యాంగులకు అవకాశం కల్పించాలి. దివ్యాంగులకు సంక్షేమశాఖ ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించి, దేవాలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ల పరిసరాల్లో ఉపాధికోసం దుకాణాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలి.

-వనం ఉపేందర్, ఎన్‌పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి, యాదాద్రిభువనగిరి

సామాజిక పోకడలపై అడపాల కవిత

• కవి, వ్యాఖ్యాత, గాయకుడు, రంగస్థల కళాకారుడిగా రాణింపు



శేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న అప్పటి ఉమ్మడి నల్లగొండ జిల్లా జడ్పీ చైర్మన్ బాలూనాయక్

డిండి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషపై ఉన్న మక్కువతో వృత్తినే ప్రవృత్తిగా చేసుకుని ప్రజల్లోకి ప్రవహించే కవిగా సాహిత్య సృజన చేస్తున్నారు అడపాల శేఖర్‌రెడ్డి. తన తొలి కవిత సంపుటి అయిన 'ప్రగతి గీత'లో సామాజిక పోకడలను ఎలుగెత్తి చాటారు. వచన కవిత్వంలోనూ లయతూగుతూ ఉండాలనే ఉద్దేశం తో పద్యమూ అన్నంతగా గీతా మాధుర్యం ధ్వనించేటట్లుగా రచనలు చేస్తారు. డిండి మండలం చెర్కుపల్లి గ్రామానికి చెందిన అడపాల శేఖర్‌రెడ్డి విశ్రాంత తెలుగు పండితుడు. తన రచనల్లో సమాజానికి ఓ సందేశం ఇస్తారు. కవిగా సమకాలిన వర్తమాన పరిస్థితులను చిత్రీకరిస్తూ మాయమై పోతున్న మానవ సంబంధాలను కళ్లకు కట్టినట్లు తన రచనలు ప్రతిబింబిస్తున్నారు. దేవరకొండ సాంస్కృతిక సాహితి సమాఖ్య వేదికగా నిరంతర సాహిత్య రచన ప్రక్రియ, కవి సమ్మేళనాల్లో, సాహిత్య గోష్ఠిలో పాల్గొంటూ తన వచన రచనలతో ముందుకు పోతున్నారు ప్రముఖ కవులు జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఎస్వీ సత్యనారాయణ వంటి ఎందరో ప్రముఖులు ప్రగతిగీతకు ముందుమాట రాశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడుగా..

రాష్ట్ర ప్రభుత్వం అడపాల శేఖర్‌రెడ్డి సేవలను గుర్తించి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక చేసి సన్మానాలతో సత్కరించింది. 2007-2008 విద్యా సంవత్సరంలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా సేవలు అందించి ఉద్యోగ విరమణ చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంపై శేఖర్‌రెడ్డి గేయ రచనలకు మండల, జిల్లా స్థాయిల్లో నగదు పురస్కారం అందుకున్నారు.

రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా

• అర్ధరాత్రి నల్లగొండ ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ముషంపల్లిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టారు. అందులో భాగంగా మంగళవారంరాత్రి నల్లగొండ మండలంలోని ముషంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జిల్లా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్వయంగా నేరస్థుల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘీక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరిపై పోలీసుల నిఘా ఎప్పటికప్పుడు ఉంటుందని, ఎలాంటి ఘటనలు జరగకుండా మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ఎన్నికల కేసుల్లో ఉన్న నేరస్థులను ఇప్పటికే బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్‌ను ఉల్లంఘించినా, కొత్తగా గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐలు రాఘవరావు, రాజశేఖర్‌రెడ్డి, నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు పాల్గొన్నారు.

స్వామికి పూలేవీ? పండ్లేవీ?

• గిట్టుబాటు కాక దుకాణం మూసేసిన టెండరుదారు



కొండ కింద వ్రతాల భవనం (పూలు, పండ్లు) వద్ద మూసిన రేకుల షెడ్డు

యాదగిరిగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం రెండో అన్నవరంగా ప్రసిద్ధి. నిత్యం సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వ్రతాలకు సంబంధించి వస్తు సామగ్రిని దేవస్థానం సరఫరా చేస్తుండగా .. పూలు, పండ్లు విక్రయించేందుకు అధికారులు టెండరును ఆహ్వానించారు. నాలుగు నెలల తర్వాత వ్యాపారంలో నష్టం వాటిల్లిందని, గిట్టుబాటు కాదని ఈవో కార్యాలయానికి టెండరుదారుడు వారం ముందుగానే లిఖిత పూర్వకంగా విన్నవించాడు. టెండరు ద్వారా పూలు, పండ్లు విక్రయించే టెండర్‌దారు దుకాణాన్ని మూసివేయ డంతో భక్తులకు అవి అందుబాటులో లేవు. కానీ, రూ.1000 టిక్కెట్‌తో వ్రతానికి కావాల్సిన ఆరు కొబ్బరికాయలు, 260 గ్రాముల చెక్కర, 250 గ్రాముల గోధుమ రవ్వ, 200గ్రాముల బియ్యం, 21 పోకలు, తమలపాకులు, ఐదు ఖర్జూరాలు, 15 గ్రాముల కుంకుమ, పసుపు, 20 గ్రాముల బుక్క, 10 గ్రాముల గులాలు, కాజు, కిస్‌మిస్‌లు, దూది, 20/20 తెల్ల వస్త్రం, ఒక కుడుక, 20 గ్రాముల నూనె, ఐదు గ్రాముల తేనె, 50 గ్రాముల నెయ్యి, పంచామృతం, ఒక జాకెట్ ముక్క, శెల్ల, కనుము వంటి వ్రత సామగ్రిని దేవస్థానం సరఫరా చేస్తోంది.

టెండరు గడువు ఇలా..

పూలు, పండ్లు విక్రయించేందుకు దేవస్థానం అధికారులు 2025 జూన్ 14 ప్రకటన విడుదల చేసి 27వ తేదీన టెండరు నిర్వహించారు. ఏడాది వ్యవధికి స్థానికురాలు మార్గం కమలమ్మ రూ. 80లక్షలకు టెండరు దక్కించుకుంది. మొత్తం టెండరు సొమ్ము మూడు భాగాలుగా విభజించి ఆగస్టు ఒకటో తేదీ నుంచి నవంబరు 30 వరకు మొదటి విడత అధికారులు డిపాజిట్ సేకరించారు. గడువు ముగిసే సరికి నష్టాలు వస్తున్నాయని, వ్యాపారం చేయలేనని టెండరుదారు చేతులెత్తేసింది. ఆమె ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో పూలు, పండ్ల లేని పూజలు కొనసాగుతున్నాయి. ఇదే అంశంపై ఆలయ డీఈవో దోర్బల భాస్కర శర్మను వివరణ కోరగా పూలు, పండ్ల కోసం త్వరలో టెండరును ఆహ్వానిస్తామన్నారు.

నేడు జిల్లా జట్ల ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్- 19 ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ బాలబాలిక జట్ల ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఈనెల 3వతేదీన నిర్వహిస్తున్న జిల్లా కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి తెలిపారు. వివరాలకు సెల్ నెం.8096745465 సంప్రదించాలన్నారు.

కిడ్నాప్ చేయడం దుర్మార్గం

భానుపురి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెంలో మామిడి యాదగిరిని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేయడం దుర్మార్గమని సూర్యాపేట అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు మర్యాద సైదులు యాదవ్ అన్నారు. మంగళవారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్ అభ్యర్థిగా నాగలక్ష్మి నామినేషన్ వేస్తే ఏకగ్రీవం కాదని, ఆమె భర్త యాదగిరిని కిడ్నాప్ చేసి దాడితో పాటు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదో తరగతి విద్యార్థిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి

- గత నెల 29న రాజాపేట గురుకులంలో ఘటన
- ఓ విద్యార్థి 'ఇన్‌స్టా'లో వీడియో పెట్టడంతో వెలుగులోకి
- ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల ఆగ్రహం
- ఏడుగురు ఇంటర్ విద్యార్థుల సస్పెన్షన్



గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను నిలదీస్తున్న బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు

రాజాపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివాదాన్ని సర్దిచెప్పేందుకు వెళ్లిన విద్యార్థిపై సహచరులు క్రికెట్ బ్యాట్, వికెట్లతో దాడిచేశారు. ఈ ఘటనను ఓ విద్యార్థి వీడియో తీసి ఇన్‌స్టా(సోషల్ మీడియా)లో పోస్టు చేయడంతో విషయం వెలుగుచూసింది. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. రాజాపేట గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు మొత్తం 600మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. మోటకొండూరు మండలం చాడ గ్రామానికి చెందిన ముస్త్యాల సుదర్శన్ లావణ్య దంపతుల రెండో కుమారుడైన ముస్త్యాల కౌశిక్ ఇదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. చదువులో చురుకుగా ఉండటంతో హాస్టల్‌లో రూం వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గత నెల 29వ తేదీ రాత్రి 11.30గంటలకు కొంతమంది ఇంటర్ విద్యార్థులు గొడవపడటంతో కౌశిక్ వారి సర్ది చెప్పి తన గదికి చేరుకున్నాడు. కొద్దిసేపటికే కొంతమంది ఇంటర్ విద్యార్థులు కౌశిక్ ఉన్న గదికి వచ్చి క్రికెట్ బ్యాట్, వికెట్‌లతో దాడి చేయటంతో స్వల్పగాయాలయ్యాయి. కొంత మంది విద్యార్థులు అడ్డుపడటంతో కౌశిక్ అక్కడ నుంచి తప్పించుకుని పాఠశాల ప్రిన్సిపాల్ గదికి చేరుకున్నాడు. ఉపాధ్యాయులు కౌశిక్ గది వద్దకు వెళ్లి వివాదాన్ని సర్దుమణిగేలా చేశారు. అయితే ఓ విద్యార్థి ఈ ఘటనను ఓ విద్యార్థి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి ఇన్‌స్టా(సోషల్‌మీడియా)లో పోస్టు చేయడంతో తల్లిదండ్రులకు తెలిసింది. ఇంత జరిగినా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడంతో వారు మంగళవారం ఉదయం బంధువులతో కలిసి పాఠశాలకు చేరుకున్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌ను, ఉపాధ్యాయులను నిలదీసి ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ కుమారుడిపై దాడికి పాల్పడిన విద్యార్థులపై పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రిన్సిపాల్ సుధాకర్ స్పందిస్తూ తన మాతృమూర్తి మృతి చెందడంతో గత నెల 30తేదీ వరకు సెలవులో ఉన్నానని, విధుల్లో చేరగానే విషయం తెలియటంతో ఏడుగురు ఇంటర్ విద్యార్థులను సస్పెండ్ చేశామని తెలిపారు. సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



ఆంజనేయస్వామికి హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలోని క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.48,85,637 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

మట్టపల్లిలో స్తంభోద్భవుడికి విశేష అర్చనలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో శ్రీస్వామికి మంగళవారం విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయాక అర్చకులు వ్యూహాలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణల అనంతరం స్తంభోద్భవునికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమలు చేపట్టారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాభోది నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. కాగా నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఇంచార్జి ఈఓ అజ్మీర జ్యోతి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

9న కొబ్బరికాయలు విక్రయించే హక్కుకు బహిరంగ వేలం..

మట్టపల్లి మహాక్షేత్రంలో కొబ్బరికాయలు విక్రయించే హక్కుకు ఈనెల 9వ తేదీన క్షేత్రంలో బహిరంగా వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో అజ్మీర జ్యోతి మగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనేవారు స్వామివారి పేరున రూ.3లక్షలు డిపాజిట్ చేసి పాల్గొనాలని, పూర్తి వివరాలకు దేవాలయ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

రాజేష్‌ది పోలీసులు చేసిన హత్య: రాజయ్య మాదిగ



కోదాడలో ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

సూర్యాపేట టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గాంధీనగర్‌కు చెందిన కర్ల రాజేష్‌ది ముమ్మాటికీ పోలీసులు చేసిన హత్యేనని ఎమ్మార్పీఎస్ నాయకుడు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్యమాదిగ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చింతలచెరువు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎంఆర్‌ఎఫ్ నిధుల కేసుకు సంబంధించి అరెస్ట్ చేసిన రాజేష్‌ను వివిధ పోలీస్ స్టేషన్‌లకు తిప్పుతూ చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే చలో కోదాడ కర్ల రాజేష్ సంతాప సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రవీరస్వామి , బొజ్జ వెంకన్న, సుధాకర్ ప్రదీప్, మల్లేష్, కృష్ణ, నగేష్, సుగుణమ్మ పాల్గొన్నారు

● కోదాడ టౌన్ కర్ల రాజేష్ మృతికి కారకులైన పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ కోరారు. ఈ మేరకు మంగళవారం కోదాడలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోడ సునీల్, చింత వినయ్ మాదిగ, ఏపూరి రాజు, ఏపూరి సత్యరాజు, బచ్చలకూరి ప్రసాద్, యడవల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● గరిడేపల్లి: మాదిగ సామాజిక వర్గానికి చెందిన కర్ల రాజేష్ కేసులో బాధ్యులైన పోలీసు అధికారులపై చట్టపర చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్ష, కార్యదర్శు లు కొత్తపల్లి రవి, కుర్రి వెంకన్నలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కే ంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో దూరె వినోద్, కడప వీరస్వామి, పిట్ట వెంకటేష్, మాచర్ల వెంకటేశ్వర్లు, నకిరేకంటి రవి, పిట్ట నాగరాజు, పవన్, ఆదాం, రాంబాబు, మచ్చ వేణు, శంకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

579.70 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా సోమవారం 579.70అడుగులుగా (282.1472 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ ద్వారా 5226 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,557 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,006 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 44,006క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరద కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు రేపు

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రి కెట్ అండర్-16 బాలుర జట్ల ఎంపిక పోటీలు ఈనెల 4వతేదీన జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సయ్యద్ అమీనోద్దిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన ఆరు జట్లను జిల్లా వేదికగా వన్‌డే లీగ్ పోటీలు నిర్వహిస్తామని, ఇందులో రాణించిన క్రీడాకారులను ఉమ్మడి నల్లగొండ అండర్-16 క్రికెట్ జట్లుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు, ఆధార్, బోనాఫైడ్ సర్టిఫికేట్‌తో హాజరు కావాలని, ఇతర వివరాలకు 9885717996 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'మోడల్' విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తుర్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో నవంబరు 30న నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తుర్కపల్లి మండలం రామపూర్ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు ఆకుల పూజ, ఎయ్యముల అంజలి, గుండెబోయిన భార్గవి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా హాలియాలో ఈ నెల నాలుగో తేదీ వరకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో ఆ విద్యార్థులు ఆడతారని కళాశాల పీడీ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.


అంజలీపురం వాసికి ఫోర్డ్ ఇండియా అవార్డు



గోరె అశోక్

హుజూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అంజలిపురం గ్రామానికి చెందిన గోరె అశోక్ ఫోర్డ్ ఇండియా- వీసర్వ్ ఇండియా అవార్డుకు ఎంపికయ్యారు. గుజరాత్‌లోని గాంధీనగర్ మహాత్మా గాంధీ కన్వెన్షన్‌లో ఈ జాతీయ అవార్డును ఈ నెల 17న అశోక్‌కు కేంద్ర మంత్రులు అందజేయనున్నారు. సౌత్ అండ్ వెస్ట్ రీజనల్ విన్నర్ అవార్డును విశాఖపట్టణంలో నవంబరు 3వ తేదీన అశోక్ అందుకున్నారు. అంజలీపురం గ్రామానికి చెందిన అశోక్ వ్యవసాయ పరికరాలను రూపొందిస్తూ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. వ్యవసాయంలో నాలుగు విధాలుగా పనిచేసే సైకిల్ వీడర్ విత్తనాలు నాటే పరికరం, పొడియం వీడర్ స్ప్రేయింగ్ యంత్రం, సౌరశక్తితో పంట రక్షణ పరికరం, అగ్రోథార్ స్ప్రేయింగ్, కలుపు మొక్కలు తొలగింపు, బరువులు తరలించడానికి ఉపయోగపడే బహుళ ప్రయోజన వాహనం ఆగ్రోమెట్, పంట కోత తర్వాత పనులకు ఉపయోగించే యంత్రం, డ్రైల్యాండ్ ప్రో 52- ఎకరానికి 1 లీటర్ ఇంధనంతో పనిచేసే యంత్రం వంటివి ఆవిష్కరించడంతో తనను జాతీయ స్థాయిలో వీసర్వ్ - ఇండియా అవార్డుకు ఎంపిక చేశారని అశోక్ తెలిపారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయి ప్రతిభ



ఎంపికైన వైష్ణవి ఐఐటీ ఒలంపియాడ్ విద్యార్థులు

సూర్యాపేటఅర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థి విజ్ఞాన్ మంతన్ వీవీఎం జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన వైష్ణవి ఐఐటీ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు 11మంది అర్హత సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ కళావతి, ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. మంగళవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించగలమని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు హర్షిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని కాకతీయ ఉన్నత పాఠశాల విద్యార్థి పున్న సతీష్(8వ తరగతి) సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డైరెక్టర్ చీదళ్ల వెంకట్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో మాట్లాడుతూ విజ్ఞాన భారతి, ఎన్‌సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ మ్యూజియమ్స్ సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా నిర్వహించే విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో తమ విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఆదర్శనీయమన్నారు. భారత శాస్త్రవేత్తల సేవలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే వీవీఎం పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం గొప్ప విషయమన్నారు. డిజిటల్ విధానంలో నిర్వహించిన పరీక్షలో సతీష్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడన్నారు. కాగా వీవీఎంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన సతీష్‌ను కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ గుండా హరినారాయణ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, శివప్రసాద్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ

నకిరేకల్ - మునుగోడు

కొత్త సొబగులు



రోడ్డు విస్తరణలో భాగంగా నార్కట్‌పల్లిలో బటర్ ఫ్లై లైట్ల ఏర్పాటు చేస్తున్నారు. అమ్మనబోలు క్రాస్ రోడ్డు నుంచి కామినేని ఎక్స్ రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టంలో భాగంగా లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పట్టణానికి కొత్త కళ సంతరించుకుంది.

● ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి

భూసారాన్ని కాపాడుకుందాం

● వరి కొయ్యలను కాలుస్తున్న రైతులు ● వాతావరణానికి, భూమికి చేటు ● నేలలోని సూక్ష్మ జీవులు నశించే ప్రమాదం ● అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



నల్లగొండ మండలం దుప్పలపల్లిలో వరికొయ్యలకు నిప్పు పెట్టిన రైతులు(ఫైల్)

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వరి కోతలు పూర్తి అయిన వెంటనే చాలా మంది రైతులు పొలంలో నీళ్ల పెట్టి దుక్కులు సిద్ధం చేసుకోకుండా వరి కొయ్యలను తగల బెట్టడంతో అనేక నష్టాలు ఎదురవుతున్నాయి. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తమై రైతులకు అవగాహన కల్పించే ప్రయత్నాలను చేపడుతున్నారు. ప్రతి గ్రామంలోనూ ఇదే పరిస్థితి ఉంది. వాతావరణ కాలుష్యం కలుషితమై పోతుంది. పర్యావరణం దెబ్బతినడమే కాకుండా మనుషుల ఆరోగ్యం సైతం దెబ్బతినే పరిస్థితి ఉందని వ్యవసాయ అధికారులతో పాటు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

● వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలకు, వాతావరణానికి, మానవ ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తుంది.

● గడ్డిలో సహజంగా మూలకాలైన నత్రజని, భాస్వరం, పోటాష్, ఇతర సూక్ష్మ పోషకాలు వాతావరణంలో కలిసిపోతాయి.

● అవశేషాలను కాల్చడం వల్ల నేల పై భాగంలో ఉష్ణోగ్రత 200ల నుంచి 300 డిగ్రీల వరకు పెరిగిపోతుంది. దీంతో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి.

● టన్ను వరిగడ్డిలో దాదాపు ఆరు కిలోల నత్రజని, 1.5కిలోల భాస్వరం, 10 నుంచి 12కిలోల పోటాషియం ఉంటుంది. వరి గడ్డిని కాల్చడం వల్ల వెలువడే వాయువు హానికరం.

● అదేవిధంగా మనుషులకు శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. నేలపై సేంద్రీయ కర్బన శాతం తగ్గిపోయి నేలపై భౌతికరసాయన జీవ లక్షణాలు నశిస్తాయి.

● రైతులు వరి పంటలు ఇతర పంటలు కోసిన తరువాత వాటి వ్యర్థాలను పొలాల్లో తగుల బెట్టడంతో భూసారం కోల్పోతుంది. దీని వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుంది.

యాసంగిలో వరి నారుమడి యాజమాన్య పద్ధతులు...

● వరి కొయ్యలను కాల్చడం వల్ల జరిగే నష్టాలతో పాటు యాసంగిలో రైతులు వరినారు మడి యాజమాన్యం కోసం యాజమాన్యం పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నారు.

● చలి సమస్యలు అధిగమించేందుకు నారుమడిపై వెదురు కర్రలతో లేదా ఇనుప చువ్వలతో ఊతమిచ్చి పైనా పాలిథీన్ షీట్‌ను రాత్రివేళలో ఉంచి ఉదయం తీసివేయాలి.

● యాసంగిలో జింక్ లోపం ఎక్కువగా కనపడుతుంది. నివారణ కోసం లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలి.

● యూరియాను పై పాటుగా వేసేటప్పుడు కిలో యూరియాకు రెండు గ్రాముల కార్బడైజమ్+ మ్యాన్‌కోజెంట్ మిశ్రమాన్ని కలిపి వేయాలి. అదేవిధంగా ప్రతిరోజు ఉదయం పాత నీటిని తీసివేసి కొత్తనీటిని అందించాలి.

నేడు హనుమత్ వ్రత మహోత్సవం

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 3వతేదీన ఉదయం 6గంటలకు హనుమత్ వ్రత మహోత్సవం వైభవంగా నిర్వహించ నున్నట్లు ఆలయ ఈవో కళాశిక కుశలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు, హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో హాజరై హనుమాన్ వత్రం తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

చండూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికలను రాజ్యాంగ బద్ధంగా నిర్వహించాలని, వేలం ద్వారా ఎన్నుకునే ఎన్నికలపై చర్యలు తీసుకోవాలని మండలంలోని బంగారిగడ్డ గ్రామానికి చెందిన తీగల అశోక్‌కుమార్ మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందజేశాడు. లక్షలాది రూపాయలతో గ్రామ సర్పంచ్ పదవిని దక్కించుకోవడం అన్యాయమన్నారు.

పనిచేసేవారిని ఎన్నుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి నిత్యం పనిచేసే వ్యక్తులను ఎన్నుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు దండు వెంకటరమణ, ఎం. పాండు, దయాకర్ ఆధ్వర్యంలో సీపీఐలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల పక్షాన, కర్షక, కార్మిక వర్గానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, మండల కార్యవర్గ సభ్యుడు ఎం.దయాకర్, ఎం.పాండు, గ్రామశాఖ నాయకులు దండు యాదయ్య, రొమ్ముల యాదయ్య, మిర్యాల యాదయ్య, అద్దంకి పాపయ్య పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బయ్యన్న

చిట్యాల, డిసెంబరు 2,(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 3వ తేదీన జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ)జిల్లా ఉపాధ్యక్షుడు ఏళ్ళ బయ్యన్న కోరారు. చిట్యాలలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటులో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించారన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్ది నరేందర్, మండల అధ్యక్షుడు మెండె వెంకన్న, ప్రధాన కార్యదర్శి పోకల కరుణాకర్, కూనూరు మధు, నాతి లింగస్వామి, జిట్ట మల్లేష్, అమరోజు వెంకన్న, మోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

చిట్యాల, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని కోరుతూ చిట్యాలలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు మునిసిపల్ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ పెద్ది నరేందర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను అధికంగా వినియోగిస్తే భావితరాలకు భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. చిట్యాలను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నమ్ముల ఆనంద్‌కుమార్, లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ జయంతి కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న దేవాలయ ప్రతినిధులు

నకిరేకల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ జయంతి సందర్భంగా షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాల కరపత్రాలను ట్రస్ట్ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, తొనుపునూరి రాంబాబు, బండారు వేణు గోపాల్, దేవరశెట్టి మధుసూదన్, వలిశెట్టి భిక్షం, పిల్లలమర్రి సునిత శ్రీనివాస్, ఉపేంద్రచారి, సురేందర్‌రెడ్డి, కోట రామచక్కం, పూజారి దుర్గి మురళీధరశర్మ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి



సభ్యత్వాలు అందజేస్తున్న బీసీ ఉద్యోగ సంఘం నాయకులు

నల్లగొండ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ డిమాండ్ చేశారు. నల్లగొండలో మంగళవారం జరిగిన బీసీ ఉద్యోగుల సంఘం సభ్యత్వ నమోదులో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాల్లో బీసీ ఉద్యోగులకు పదన్నతులు కల్పించాలన్నారు. 30 ఏళ్ల పనిచేసిన బీసీ ఉద్యోగులు ఎలాంటి ప్రమోషన్ లేకుండా నే ఉద్యోగ విరమణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. మండల్ కమిషన్, పార్లమెంట్ కమిటీ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫారసు చేసిందన్నారు.బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించడానికి చట్ట పరమైన, రాజ్యాంగపరమైన, న్యాయపరమైన అడ్డంకులు అవరోధాలు లేవని అన్నారు. బీసీల ఎదుగుదలకు క్రిమిలేయర్ గొడ్డలిపెట్టు అన్నారు. త్వరలో జిల్లాలో అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేసి జిల్లా మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారులు వాడపల్లి సాయిబాబా, నల్ల సోమ మల్లయ్య, బీసీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ లక్ష్మీనవీన్, వేణు, నరేష్, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సమరమే

(5వ పేజీ తరువాయి)



నామినేషన్లు వేసేందుకు బారులు తీరిన అభ్యర్థులు

బరిలో నిలిచినట్లయింది. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న నల్లగొండ అసెంబ్లీతోపాటు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న మునుగోడు నియోజకవర్గం, ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రాతినిధ్యం వహిస్తోన్న నకిరేకల్ నియోజకవర్గాల్లోని గ్రామపంచాయతీలతోపాటు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సొంత మండలం శాలిగౌరారం ఈ డివిజన్ పరిధిలో ఉండడంతో ఈ గ్రామాల్లో సర్పంచ్ పదవులకు డిమాండ్ పెరిగింది.

ఏకగ్రీవం చేసుకుంటే రూ.30లక్షలు

నల్లగొండ నియోజకవర్గంలో గ్రామపంచాయతీలు ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రూ.10లక్షల నజరానాతోపాటు, తాను మరో రూ.20లక్షల నిధులు అందిస్తానని మంత్రి వెంకటరెడ్డి హామీఇచ్చారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఇక్కడ నిధుల వరద ఉంటుందని, అభివృద్ధి పనులు జరుగుతాయని, సర్పంచ్‌గా గెలిస్తే పేరు, ప్రతిష్ఠలతోపాటు ఆర్థికంగానూ బలపడవచ్చనే నమ్మకంతో పలువురు గ్రామనాయకులు సర్పంచ్ పదవులకు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. అధికార కాంగ్రెస్ నుంచే ఒక్కో గ్రామంలో ముగ్గురు, నలుగురు అభ్యర్థులు పోటీ పడుతుండడం ఇక్కడ ఆ పదవికి ఉన్న క్రేజ్‌ని తెలియజేస్తోంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు సైతం అన్ని పంచాయతీల్లో పోటీకి సిద్ధమై నామినేషన్లు వేశారు. బీజేపీ, సీపీఎం, సీపీఐ సైతం బలమున్నచోట బరిలో ఉండేందుకు సిద్ధమయ్యారు. మునుగోడు నియోజకవర్గంలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ సైతం పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నకిరేకల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో సర్పంచ్ పదవులకు పోటాపోటీ నెలకొనడంతో ఎమ్మెల్యేకు, ఇతర ప్రధాన నేతలకు వారిని బుజ్జగించడం సవాల్‌గా మారింది. నల్లగొండ, చండూరు డివిజన్లలోని మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో కొందరు సర్పంచ్ అభ్యర్థులు బుజ్జగింపులతో సర్దుబాటుకు వచ్చి ఉపసంహరణకు అంగీకరిస్తుంటే, మరికొందరు పార్టీ మారి పోటీకి సిద్ధమయ్యారు. ఇంకొందరు స్వతంత్ర అభ్యర్థులుగానైనా పోటీచేసి తీరుతామని చెబుతున్నారు. ఒకే గ్రామంలో పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు నామినేషన్లు వేసిన అభ్యర్థులను మండల, జిల్లా నాయకులు బుజ్జగిస్తున్నారు. నామినేషన్ విత్‌డ్రా చేసుకుంటే ఇప్పటివరకు అయిన ఖర్చుల తోపాటు, ఇతర తాయిలాలు ఇప్పిస్తామని హామీ ఇస్తున్నారు. కొందరు ముఖ్య నాయకులుంటే వారికి భవిష్యత్‌లో మార్కెట్ డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, దేవాలయ కమిటీల పదవులు ఇప్పిస్తామని, కాంట్రాక్టులలో అవకాశం కల్పిస్తామని హామీలిస్తామంటూ చర్చలు జరుపుతున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు బుధవారం తుది గడువు కావడంతో నామినేషన్లను ఎవరు ఉపసంహరించుకుంటారు...? ఎవరు పోటీలో ఉంటారనే అంశం తేలనుందని, పోటీలో ఉండే వారిని బట్టి పోటీతీవ్రత తెలుస్తుందని చెబుతున్నారు.



బాధ్యతల అప్పగింత

డీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన పున్నా కైలాష్ నేత మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కైలాష్ నేతకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మర్రిగూడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లఘించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దూది రాజు అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఎర్రగండ్లపల్లి, మండలకేంద్రంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మర్రిగూడ నాంపల్లి, చింతపల్లి ఎస్ఐలు కృష్ణా రెడ్డి, రామ్మూర్తి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

మర్రిగూడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక పాఠశాల దామెర బీమనపల్లి ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరామ్ అన్నారు. మంగళవారం విద్యార్థులతో నినాదాలు ఇస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజులత, కొండ శ్రీనివాస్, సభావత్ వెంకట్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ముఖ్య అర్చకుడు మల్లాచారి ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి కల్యాణం నిర్వహించారు. కుంకుమ పూజలు జరిపించి చీర, సారె ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ మాజీ చైర్మన్లు కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, చెనగోని యాదగిరి అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు దామోదర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



భరత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, డిసెంబరు 2,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు జెరిపోతుల భరత్‌గౌడ్ పేరును ఎమ్మెల్యే వీరేశం ప్రకటించారు. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆశించిన దూదిమెట్ల సత్తయ్య బీఆర్ఎస్‌లో చేరడంతో భరత్‌కు మార్గం సుగమమైంది. మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి నకిరేకల్‌లో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసినప్పుడు ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, ఐతరాజు యాదయ్య, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, రాధారపు బిక్షపతి, వేముల నర్సింహ్మా, వడ్డేగోని నర్సింహ్మా, యానాల రాంరెడ్డి, అజీజ్, సమద్, ప్రజ్ఞాపురం సత్తి, బోడ మధు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి



బీజేపీలో చేరుతున్న నాయకులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జాల మంజుల సైదులు హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, పేదల కోసం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్యవైశ్యుడు బండారు రవికుమార్ కూడా బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, నడింపల్లి శ్రవణ్‌కుమార్ మునుకుంట్ల గణేశ్, నోముల నాగరాజు, బిల్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకుడు

నార్కట్‌పల్లి, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.ఎడవల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సింగిరెడ్డి దామోదర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన దామోదర్‌రెడ్డితో పాటు మరికొంత మంది కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, బొక్క భూపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు


మర్రిగూడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఉంటుందని టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి దోమల వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో టీడీపీ అభ్యర్థులు లేని స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని తెలిపారు. సమావేశంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల యాదయ్య, సత్తయ్య, గొల్లపూడి చిన్న గుణగంటి, శ్రీరాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ఏర్పాటు



భోజనం పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్

నల్లగొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నార్కెట్‌పల్లి మండలం అమ్మనబోలు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు యర్ర విజయ్‌కుమార్ తల్లి యర్ర సుశీల జయంతి సందర్భంగా ఆపాఠశాలకు చెందిన విద్యార్థులకు భోజనం అందించారు. రుచికరమైన భోజనం అందించడం పట్ల విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం. జె. శేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





పంచాయతీ సమరమే

- ముగిసిన రెండోవిడత నామినేషన్ల ఘట్టం
- మూడో విడతకు నేటి నుంచి నామినేషన్లు
- తొలి విడతలో పోటాపోటీతో ఉపసంహరణలకు నేతల ప్రయత్నాలు

గ్రామపంచాయతీ ఎన్నికల సమరం ఊపందుకుంది. జిల్లాలో రెండో విడతలో ఎన్నికలు జరిగే 282 గ్రామపంచాయతీల్లో సర్పంచ్, 2,418 వార్డు సభ్యుల పదవులకు మంగళవారంతో నామినేషన్ల స్వీకరణ ముగిసింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు క్లస్టర్ల వద్ద అభ్యర్థులు బారులుతీరి ఉండడంతో సాయంత్రం 5 గంటల తర్వాత కూడా నామినేషన్ పత్రాలను స్వీకరించారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

మూడో విడత ఎన్నికలు జరిగే దేవరకొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాలకు 269 గ్రామపంచాయతీలు, 2,206 వార్డు సభ్యుల స్థానాలకు బుధవారంనుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. మొదటి విడత ఎన్నికలు జరిగే నల్లగొండ, చండూరు డివిజన్లలోని పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు పోటాపోటీ ఉండడంతో ఒకే పార్టీ నుంచి బరిలో ఉండేందుకు సిద్ధమైన అభ్యర్థులను బుధవారం ఉపసంహరించేలా నేతలు తుదిప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా మొత్తం జిల్లాలో ఎన్నికల అన్ని పంచాయతీల్లో ఎన్నికల వాతావరణం నెలకొని సందడి కొనసాగుతోంది.

నేటి నుంచి మూడోవిడత నామినేషన్ల స్వీకరణ

జిల్లాలోని దేవరకొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లోని 269 గ్రామపంచాయతీలు, 2206 వార్డుసభ్యుల పదవులకు బుధవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందుకోసం మూడు, నాలుగు పంచాయతీలకు కలిపి ఒక క్లస్టర్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ క్లస్టర్ వద్ద అభ్యర్థులకు సహాయకారిగా ఉండేందుకు ఒక హెల్ప్‌డెస్క్‌ని సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఈడివిజన్‌లో మొత్తం 2,81,329 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఈ డివిజన్‌లో ఈ నెల 5వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుండగా, 9వతేదీన నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. 17వ తేదీన పోలింగ్ జరుగుతుంది.

రెండోవిడత పంచాయతీల్లో ముగిసిన నామినేషన్లు

రెండోవిడతలో ఎన్నికలు జరిగే మిర్యాలగూడ డివిజన్‌లోని 10 మండలాలకు 282 గ్రామపంచాయతీలు, 2,418 వార్డు సభ్యుల పదవులకు పోటీపడే అభ్యర్థులు అధిక సంఖ్యలో మంగళవారం రాత్రి వరకు నామినేషన్లు దాఖలు చేశారు. పోటీచేసే అభ్యర్థులెవరికీ నామినేషన్ వేయలేకపోయామనే అసంతృప్తి ఉండకూడదనే ఉద్దేశ్యంతో సాయంత్రం 5గంటలకు గడువు ముగిసిన తర్వాత కూడా లైన్‌లో నిలుచున్న అభ్యర్థులందరి నామినేషన్ పత్రాలను అధికారులు స్వీకరించారు. భారీగా నామినేషన్లు దాఖలవడంతో ఈ డివిజన్‌లో పలు గ్రామాల్లో ఎన్నికలు రసవత్తరంగా కొనసాగనున్నాయి. మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలతోపాటు పాక్షికంగా నల్లగొండ నియోజకవర్గంలోని గ్రామాలు ఈ డివిజన్‌లో ఉన్నాయి. ఇక్కడ అన్ని పంచాయతీల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీ తలపడుతుందని చెబుతున్నారు. ఏకగ్రీవాలకు ప్రాధాన్యమిస్తోన్న గ్రామాల్లో నామినేషన్ల ఉపసంహరణ గడువు వరకు ఇందుకోసం ప్రయత్నాలు చేసే పరిస్థితి కనిపిస్తోంది.

బాబ్బాబూ.. తప్పుకోండి...




జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరిగే నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 14 మండలాల్లోని 318 గ్రామపంచాయతీలు, 2,870 వార్డులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. 318 సర్పంచ్ పదవులకు 1,950 నామినేషన్లు దాఖలు కావడం రాష్ట్రంలోనే రికార్డుగా చెబుతున్నారు. ఒక్కో సర్పంచ్ స్థానానికి సగటున ఆరుగురు అభ్యర్థులు...

- మిగతా 8వ పేజీలో...

ఏకగ్రీవాల దిశగా..

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తామంటున్న అభ్యర్థులు
- తీర్మాణాలు చేసుకుంటున్న గ్రామస్థులు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏకగ్రీవాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రచారాలు, తాయిళాలకు మద్యం, డబ్బులు పంపిణీ చేసే బదులు గ్రామాభివృద్ధికి ఆ నిధులు కేటాయిస్తామని అభ్యర్థులు ప్రకటిస్తుండడంతో గ్రామస్థులు ఏకగ్రీవం చేసుకుంటున్నారు. పోటీగా బరిలో నిలిచిన అభ్యర్థుల నామినేషన్లను ఉపసంహరించుకునేలా చేస్తున్నారు. ఆలేరు మండలం భైరాంనగర్ పంచాయతీకి కంపరాజు వెంకటేశ్వర్‌రాజు సర్పంచ్‌గా ఏక్రగీవం అయ్యారు. భువనగిరి మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి, వార్డు సభ్యులు ఏక్రగీవమయ్యారు. సర్పంచ్‌గా ఏకగ్రీవమైన కొలను రవికళారెడ్డి గ్రామాభివృద్ధికి రూ.27లక్షల విరాళంగా ప్రకటించారు. రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ నారపాక మాధవితోపాటు ఏడుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని బుడ్డరెడ్డిగూడెం, యలమోనిగూడెం గ్రామస్థులు తీర్మానాలు చేసుకున్నారు. బుడ్డరెడ్డిగూడెంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జరిగిన సమావేశంలో సింగెం బాలకృష్ణను ఏకగ్రీవం చేసేందుకు నిర్ణయించారు. యలమోనిగూడెం వాడపల్లి వెంకన్నను సర్పంచ్‌గా ఎన్నుకునేందుకు తీర్మానించారు.

వరి కొయ్యల కాల్చివేతతో నష్టాలు

- జేడీఏ శ్రవణ్ కుమార్



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్ కుమార్

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక నష్టాలు జరుగుతాయని జేడీఏ శ్రవణ్ కుమార్ అన్నారు. మంగళవారం నల్లగొండ మండలం అన్నారెడ్డిగూడెం గ్రామంలో వరికొయ్యల కాల్చివేతతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చితే నేలపై భాగంలో ఉష్ణోగ్రత 200 నుంచి 300డిగ్రీల వరకు పెరిగి, నేలలోని పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. వరి గడ్డిలో సహజంగా ఉండే నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి మూలకాలు వాతావరణలో కలిసి పోతాయన్నారు. యాసంగిలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల నారుమడి యాజమాన్యంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల కంటే తగ్గినప్పుడు నారు ఎర్రగా మారి కొన్నిసార్లు ఎండిపోతుందన్నారు. దీనికి సాధారణంగా అందించే ఎరువులతోపాటు ప్రతీ రెండు గుంటల నారుమడికి రెండు క్వింటాళ్ల కోళ్ల ఎరువు, గొర్రెల ఎరువు, లేదంటే వర్మీకంపోస్టు వేయాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మండల ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి వార్డులో పురుషులు ఎందుకు?

- కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆగ్రహం



జిల్లాకేంద్ర ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రసూతి వార్డులో పురుషులు ఉండడం ఏమిటని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లాకేంద్ర ఆస్పత్రి సూపరింటిండెంట్‌ను ప్రశ్నించారు. వార్డులో ఉన్న వారందరినీ వెంటనే బయటికి పంపాలన్నారు. మంగళవారం ఆమె నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీచేసి ఆస్పత్రిలోని ప్రసూతి, చిన్నపిల్లల వార్డు, ఐసీయూ తదితర వార్డుల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రసూతి వార్డులో పురుషులు ఉండడంతో ఆమె ఆగ్రహం వ్యక్తంచేస్తూ తక్షణమే అందరినీ బయటకు పంపించాలని, పురుషులను ప్రసూతి వార్డులోకి ఎందుకు అనుమతించారని డ్యూటీ డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ పై సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ప్రసవించిన మహిళలకు సహాయకులు ఎక్కువ మంది ఉంటే చిన్న పిల్లలకు ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని, అందువల్ల ఎక్కువ మంది ఉండకుండా, కేవలం ఒక్కరు మాత్రమే సహాయకులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డాక్టర్ వందన, డాక్టర్ నగేష్, తదితరులున్నారు.

లే అవుట్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

లే అవుట్ ప్రక్రియ పనులను నియమ నిబంధనలకు లోబడి పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ఆమె చాంబర్‌లో ఇరిగేషన్, మునిసిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు, తహసీల్దార్‌లతో లేఅవుట్లపై సమావేశం నిర్వహించారు. భూసేకరణ అనుమతులను జాగ్రత్తగా పరిశీలించాలని, అనధికార లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదన్నారు. గ్రామ పంచాయతీ, మునిసిపల్ అధికారులు ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకొని అత్యవసర కాల్వలు, ఫుల్ ట్యాంక్ లెవల్ పరిరక్షణపై రాజీపడకుండా, నీటి ముంపు ప్రమాదం లేకుండా మంజూరు చేయాలన్నారు. జిల్లా ఇరిగేషన్ అధికారి నాగార్జున, ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీధర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ మసాబ్ అహ్మద్, డీటీసీపీవో కృష్ణవేణిపాల్గొన్నారు.

నామినేషన్ల అప్పీళ్ల పరిశీలన

గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా నల్లగొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్లపై వచ్చిన అప్పీళ్లను కలెక్టర్ ఇలాత్రిపాఠి మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పరిశీలించారు. నల్లగొండ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్లపై 19 అప్పీళ్లు రాగా, అప్పీళ్లను నిబంధనల ప్రకారం ఆర్‌వోల సమక్షంలో పరిశీలించి ఆర్డీవో రూపొందించిన జాబితాను తనిఖీ చేశారు. వచ్చిన 19 అప్పీళ్లలో 15 తిరస్కరణకు గురికాగా, నాలుగు అప్పీళ్లు అంగీకరించినట్లు ఆర్‌డీవో అశోక్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. చండూరు డివిజన్‌కు సంబంధించి నామినేషన్లపై మూడు అప్పీళ్లు రాగా, రెండు తిరస్కరణ అయ్యాయని, ఒకటి అంగీకరించినట్లు చండూరు ఆర్డీవో శ్రీదేవి తెలిపారు. ఆమెవెంట నల్లగొండ ఆర్‌డీవో వై.అశోక్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల నివారణే లక్ష్యం

జిల్లాలో 42రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు : ఎస్పీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్ తదితరులు

నల్లగొండ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సైబర్ నేరాల నివారణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులు, విద్యార్థులతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో 42రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఈ నెల 2వ తేదీ నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు ప్రతీవారం ఒక ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమం చేపడుతామన్నారు. ఇందులో భాగంగానే తొలిరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో కళాశాల విద్యార్థులకు ఆన్‌లైన్ జూమ్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించామన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సైబర్ క్రైం ఎస్ఐ విష్ణు, టూటౌన్ ఎస్ఐ సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

డీసీసీ అధ్యక్షుడు పున్నాకైలాష్ నేతకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన



సీఎం నుంచి నియామక పత్రం అందుకుంటున్న పున్నా కైలాష్ నేత

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీనియర్‌నేతల సలహాలు, సూచనలతో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని నూతన డీసీసీ అధ్యక్షుడు పున్నాకైలాష్ నేతకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం సీఎంను కలిసిన కైలాష్‌కు ఈమేరకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్ష నియామకపత్రాన్ని సీఎం నుంచి అందుకున్నారు. సమావేశంలో కొత్త డీసీసీ అధ్యక్షులకు పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పలు సూచనలు చేశారని కైలాష్ తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో అందరి సమన్వయంతో వంద శాతం గెలుపు లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్లు వెల్లడించారు. ఓటు చోరీకి నిరసనగా ప్రతీ నియోజకవర్గం నుంచి 25వేల మందితో సంతకాల సేకరణ చేపట్టాలని, ప్రతీ బూత్ నుంచి కనీసం 100 మంది సంతకాలు సేకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 14న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా నుంచి 500 మంది వరకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, నేనావత్ బాలూనాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా

- నల్లగొండ మండలంలో అర్ధరాత్రి ఎస్పీ తనిఖీలు



తనిఖీల్లో భాగంగా స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

స్థానిక సంస్థల ఎన్నికలకు పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో గొడవలు, ఘర్షణకు దిగిన వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నల్లగొండ మండల పరిధిలోని ముషంపల్లిలో తనిఖీలు నిర్వహించారు. రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ రూరల్)

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్య తీసుకోవాలి



ఎంజీయూలో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

- అఖిల పక్షనేతల డిమాండ్

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంజీయూలో విద్యార్థుల డబ్బులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీటెక్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకుడు దుర్గప్రసాద్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్‌చేశారు. మంగళవారం ఎంజీయూలో బీటెక్ కళాశాల ప్రధాన గేట్ వద్ద విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా ఆయా సంఘా నేతలు మాట్లాడుతూ టాస్క్ పేరిట రూ.3లక్షల పైగా డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన డబ్బులతో శిక్షణ ఇవ్వకుండా మోసం చేశారన్నారు. తక్షణమే పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వ్యక్తిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, విధుల నుంచి తొలగించాలని డిమాండ్‌చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణే తమ లక్ష్యమని, విచారణ పూర్తి అయ్యే వరకూ ఆందోళన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు వాడపల్లి నవీన్, బీసీ సంఘం నాయకులు కరుణాకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు సురేష్, పీడీఎస్‌యూ నాయకులు హర్ష తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కర్రెం రవికుమార్, గౌతమ్, శివ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి పూలేవీ? పండ్లేవీ?


- గిట్టుబాటు కావడంలేదని దుకాణం మూసేసిన టెండర్‌దారుడు



లక్ష్మీనృసింహస్వామికి సమర్పించేందుకు పూలు, పండ్లు కరువయ్యాయి. కొండపై ఏర్పాటు చేసిన దుకాణదారుడు గిట్టుబాటు కావడంలేదని దుకాణం మూసివేయడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విస్తరిస్తున్న రైస్ మిల్లులు

- ధాన్యం కోసం ఎదురుచూపు
- ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం సేకరణ



మిర్యాలగూడ సమీపంలో ఏర్పాటు చేసిన రైస్‌మిల్లు

విస్తరిస్తున్న రైస్ మిల్లులు



మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ ప్రాంతం రైస్‌మిల్లుల ఏర్పాటులో ఆసియా ఖండంలోనే పేరుగాంచింది. మిర్యాలగూడ రైస్‌మిల్లుల నిర్మాణాలు చేపడుతున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో ప్రధాన కేంద్రంగా నిలిచిన మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో వరిసాగు ప్రధాన పంట కావడంతో రైస్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు వ్యాపార వర్గాలు ముందడుగు వేస్తున్నాయి. మిర్యాలగూడలో ప్రస్తుతం 182మిల్లులు ఉండగా 108మిల్లులు కొనసాగుతున్నాయి. గతంలో మిల్లుల వద్ద ధాన్యం విక్రయించుకునేందుకు వచ్చిన రైతుల రోజుల తరబడి పడిగాపులు కాస్తూ ఎదురుచూసిన పరిస్థితులు తెలిసిందే. ధాన్యం కొనుగోళ్లు చేపట్టే సందర్భంలో కొర్రీలు పెట్టి తక్కువ ధర చెల్లించేవారు. దీంతో రైతులు నష్టపోయిన సందర్భాలు లేకపోలేదు. మిల్లుల నిర్వహణలో మిల్లర్లు ఆధునిక యాంత్రీకరణకు సిద్ధమయ్యారు. ధాన్యం కొనుగోళ్లను విస్తృతంగా చేపడుతున్నారు. మిర్యాలగూడ ప్రాం తం నుంచి బియ్యాన్ని ఇతర దేశాల్లో విక్రయించే స్థాయిలో వ్యాపారం సాగిస్తున్నారు. ధాన్యం సేకరణ కోసం మిల్లుల వద్ద మిల్లర్లు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వ్యాపారం సాగిస్తున్నారు. ప్రస్తుత సీజన్ ప్రారంభం దశలో వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల్లో వరి పంట దెబ్బతిన్నది. దీంతో మిల్ పాయింట్ల వద్దకు వచ్చిన ధాన్యానికి అరకొర ధర నిర్ణయిస్తూ రైతులకు ఇబ్బందులకు గురి చేసినట్లు విమ్మలున్నాయి.

బయటి ధాన్యానికి ధర పెంచి..

స్థానిక రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన సమయంలో రూ.2వేల నుంచి ప్రారంభించగా జిల్లా అధికారుల హెచ్చరికలతో రూ.2400 నుంచి రూ.2600 వరకు ధర నిర్ణయించి స్థానికంగా ఉన్న రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేశారు. సీజన్ ముగింపు దశ నుంచి ధాన్యానికి ధర పెంచడంతోపాటు బయటి ప్రాంతాల నుంచి రూ.2700 రూ.2900 వరకు ధర నిర్ణయిస్తూ ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. మిర్యాలగూడ ప్రాంతం నుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు సరిపోకపో వడంతోనే బయటి ధాన్యానికి ధర కల్పిస్తూ కొనుగోలు చేస్తున్నారు. మిల్లుల నిల్వ సామర్థ్యం పెంచడంతో కొనుగోళ్లు పెంచినట్లు తెలుస్తోంది. మిల్లుల్లో కొందరు ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన సెలోన్‌లలో ఒక్కదానిలో 40వేలకు పైబడి బస్తాల ధాన్యం స్టాక్ చేసుకునే వీలు కలిగి ఉన్నాయి. అలాంటివి ఒక్క మిల్లుల్లో 5,6 సెలోన్‌లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గోదాముల్లో లక్ష బస్తాల ధాన్యాన్ని నిల్వ చేయగలిగేలా ఏర్పాట్లు ఉన్నాయి. ధాన్యం దిగుమతి, బియ్యం ఎగుమతి చేటు చేసుకుంటున్న సందర్భంలో ధాన్యం సేకరణ కోసం వరంగల్, తెనాలి, నాయుడుపేట, నంద్యాల, నిర్మల్, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి దళారులను ఏర్పాటు చేసుకోవడంతోపాటు సిబ్బందిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు మిల్ పాయింట్లలో ఈ సీజన్‌లో 5,30,250 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బాలు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థులతో దరఖాస్తు చేయించాలని ఎంఈవో లావూరి బాలు అన్నారు. ఎంఈవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 నుంచి 8వ తరగతి అభ్యసించే బాలురకు రూ.వెయ్యి, బాలికలకు రూ.1500 ఉపకారవేతనం అందుతుందన్నారు. 9, 10వ తరగతి అభ్యసించే విద్యార్థులకు రూ.3500 ప్రభుత్వం అందజేస్తుంద న్నారు. అర్హులైన విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ, బ్యాంకు ఖాతా పత్రాలతో దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే రానున్న విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు పెంచవచ్చన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు మంగ్యానాయక్, వేణుధర్, నాగమణి, రాఘవరెడ్డి, శ్రీను, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయభాస్కర్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయ్‌భాస్కర్

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణానికి చెందిన మిట్టపల్లి విజయ భాస్కర్ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. వాసవీక్లబ్ ఆర్గనైజేషన్ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయ భాస్కర్ అవయవదానంపై విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు నేత్రదానాల్లో జిల్లాను ముందంజలో నిలిపారు. ఆయన సేవలను గుర్తించిన క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ ఈ అవార్డును అందజేసింది. విజయభాస్కర్‌ను స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

దేవరకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని దేవరకొండ డివిజన్ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 3న హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచారశాఖ కమిషనరేట్ ఎదుట జర్నలిస్టుల ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జర్నలిస్టులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, అక్రిడిటేషన్లు, హెల్త్ ఇన్సూరెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా జానారెడ్డి



పెద్దవూర, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవ నిర్వహించిన ఏబీవీపీ జాతీయ మహాసభల్లో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు మండలంలోని రామన్నగూడేనికి చెందిన నక్క జానారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు నెలలో డెహ్రాడూన్, ఉత్తరాఖండ్‌లో జరిగిన ఏబీవీపీ 71వ జాతీయ మహాసభలను నిర్వహించగా తనను జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు జానారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ

వేములపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని హామీలతో తెలంగాణ ప్రజలను మోసగించి అధికారం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో చిర్రమల్లయ్యయాదవ్, కట్టా మల్లేష్‌గౌడ్, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, జడ మట్టయ్య, దైద జాన్సన్, పుట్టల సందీప్, పెదపంగ సైదులు, నక్క నాగరాజు, నాగవెల్లి యాదగిరి, శేఖర్‌రెడ్డి, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



నామినేషన్లు వేసేందుకు బారులు తీరిన అభ్యర్థులు

వేములపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడు రోజులుగా స్వీకరించిన నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 12 సర్పంచ్ స్థానాలకుగాను 126 నామినేషన్లు సమర్పింగా మొత్తం 116 వార్డులకుగాను 406 నామినేషన్ పత్రాలు దాఖలైనట్లు మండల ఎన్నికల అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు.

బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

● బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేష్

బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన బీసీ ఉద్యోగుల సంఘం సభ్యత్వ నమోదులో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాల్లో బీసీ ఉద్యోగులకు పదన్నతులు కల్పించాలన్నారు. 30 ఏళ్ల పనిచేసిన బీసీ ఉద్యోగులు ఎలాంటి ప్రమోషన్ లేకుండా నే ఉద్యోగ విరమణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. మండల్ కమిషన్, పార్లమెంట్ కమిటీ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫారసు చేసిందన్నారు.బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించడానికి చట్ట పరమైన, రాజ్యాంగపరమైన, న్యాయ పరమైన అడ్డంకులు అవరోధాలు లేవని అన్నారు. బీసీల ఎదుగుదలకు క్రిమిలేయర్ గొడ్డలిపెట్టు అన్నారు. త్వరలో జిల్లాలో అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేసి జిల్లా మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారులు వాడపల్లి సాయిబాబా, నల్ల సోమ మల్లయ్య, బీసీ సంక్షేమ శాఖ సూపరింటెండెండ్ లక్ష్మీనవీన్, వేణు, నరేష్, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలి

దామరచర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండో విడతగా త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశవాదులను, అవినీతి పరులను ఓడించాలన్నారు. కార్యక్రమంలో ధనావత్ శాంతా, ధీరావత్ లింగనాయక్, జమ్ముల కోటయ్య, గజ్జల లక్ష్మీనరసింహారెడ్డి, శేషయ్య, రాములు, లక్ష్మయ్యచక్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

నేటినుంచి మూడో విడత నామినేషన్లు

● ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



దేవరకొండ, పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి, చింతపల్లి, డిండి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో మూడో విడత ఈనెల 17వ తేదీన జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు ఈ నెల 3 నుంచి నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభంకానుంది. అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవరకొండ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో 269 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2,206 వార్డులతోపాటు 70 క్లస్టర్‌లను అధికారులు నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేశారు. డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో 1,40, 913 మంది పురుషులు, 1,40,388 మంది మహిళలు, ఇతరులు 20 మంది ఉన్నారు. మొత్తం 2, 81,321 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అధికారులు ముందస్తుగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. డివిజన్ పరిధిలో 2, 216 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. ఈ నెల 3న ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఈనెల 5న సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని అధికారులు తెలిపారు. నామినేషన్‌ల పరిశీలన ఈనెల 6న సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. 6న చెల్లుబాటు అయిన అభ్యర్థుల నామినేషన్‌ల జాబితా పరిశీలిస్తామన్నారు. అప్పీల్‌లకు ఈనెల 7న సాయంత్రం వరకు ఉంటుందన్నారు. అప్పీల్‌ల పరిష్కరణకు చివరితేది ఈనెల 8 సోమవారం సాయంత్రంలోపు ఉంటుందన్నారు. అభ్యర్థుల ఉపసంహరణ తేది ఈనెల 9న మంగళ వారం మధ్యాహ్నం 3గంటలలోపు ఉంటుందన్నారు. పోటీచేయు అభ్యర్థుల జాబితా ఈనెల 9న ప్రకటిస్తామన్నారు. పోలింగ్ ఈనెల 17న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు 17న మధ్యాహ్నం 2గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఫలితాలు ఓట్ల లెక్కింపు అనంతరం ప్రకటిస్తామన్నారు. అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని ఆర్డీవో తెలిపారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు.

నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలి

● సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



వేములపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్

వేములపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా గత మూడు రోజులుగా సర్పంచ్, వార్డు సభ్యులు సమర్పించిన ప్రతి నామినేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అధికారులను సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వేములపల్లి క్లస్టర్ కేంద్రంలో నామినేషన్ల స్వీకరణను ఆయన పరిశీలించారు. వచ్చిన నామినేషన్లను ఎప్పటికప్పుడు స్కాన్ చేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలని, వాటి వివరాలను సకాలంలో డీపీవో కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దండ జితేందర్‌రెడ్డి, ఆర్వో యోగేశ్వర్‌లు ఉన్నారు.

కొండమల్లేపల్లి: ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీవో స్వర్ణలత అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వాహణపై మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూట్నీ, ఉపసంహరణ, పోలింగ్ విధానం, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీవో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థుల నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయేందర్‌రెడ్డి, తహశీల్దార్ నరేందర్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఎంపీవో సుదీర్‌కుమార్, మాస్టర్ ట్రైనర్స్ కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, బాలు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని ఘడియా గౌరారంలో మంగళ వారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు, పింఛన్ భృతితో పాటు, ఇందిరమ్మ ఇళ్ల రేషన్‌కార్డు, సన్నబియ్యం, రైతులకు రైతు భరోసా, సన్నబియ్యానికి బోనస్‌తో పాటు వంట గ్యాస్ రాయితితో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, యువతల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశ చరిత్రలో అగ్రగామిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, నాయకులు ఎరుకుల వెంకటయ్య గౌడ్, ముచ్చర్ల యాదగిరి, అంగిరేకుల నాగభూషణ్, దొంతం వెంకటనరసింహారెడ్డి, గుండ్లపల్లి నర్సిరెడ్డి, పాల్గొన్నారు.

గెలుపు గుర్రాల కోసం పార్టీల కసరత్తు



దేవరకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో ఈ నెల 3వ తేదీ నుంచి గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకానుంది. డివిజన్ పరిధిలో 269 గ్రామపంచాయతీల్లోని 70 క్లస్టర్లలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికలలో సర్పంచ్‌గా గెలిచే అభ్యర్థులనే ఎంపిక చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ సన్నాహాలు చేస్తున్నాయి. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు పోటీ చేసేందుకు ఉత్సహం చూపుతున్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ వివిధ మండలాలలో పర్యటిస్తూ అభ్యర్థులను ఎంపీక చేసే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సర్పంచ్ అభ్యర్థుల గెలిచేవారినే ఎన్నికల్లో అభ్యర్థులుగా రంగంలో దింపేందుకు సిద్దమవుతున్నారు. బీజేపీ, సీపీఐ, సీపీ ఎం నాయకులు కూడా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తు న్నారు. ఈ నెల 6న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవరకొండ నియోజక వర్గంలో బహిరంగసభతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు చేయనున్నారు. దీంతో నియోజక వర్గంలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సర్పంచ్‌తోపాటు వార్డులకు పోటీ చేసేందుకు సన్నధం అవుతున్నారు. దీంతో దేవర కొండ నియోజకవర్గంలో ఎన్నికల సందడి నెలకొంది.

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

డిండి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ సర్పంచ్‌లుగా పోటీ చేసే అభ్యర్థులు బుధవారం నుంచి తమ నామినేషన్‌లు దాఖలు చేసుకోవాలని ఎంపీడీవో వెంకన్న మంగళవారం తెలిపారు. మండలంలోని వీరబోయినపల్లి, వావిల్‌కోల్, తవక్లాపూర్, ఎర్రారం, బొలనపల్లి, కందుకూరు, గోనబోయినపల్లి, టి.గౌరారం, చెర్కుపల్లి, డిండి గ్రామాలలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలలో నామినేషన్‌లు దాఖలు చేయాలని కోరారు. ఈ నెల 17న 39 గ్రామపంచాయతీలలో 326 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 39 గ్రామపంచాయతీల పరిధిలో 41525 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ సమరమే

(5వ పేజీ తరువాయి)

బరిలో నిలిచినట్లయింది. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న నల్లగొండ అసెంబ్లీతోపాటు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న మునుగోడు నియోజకవర్గం, ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రాతినిధ్యం వహిస్తోన్న నకిరేకల్ నియోజకవర్గాల్లోని గ్రామపంచాయతీలతోపాటు ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి సొంత మండలం శాలిగౌరారం ఈ డివిజన్ పరిధిలో ఉండడంతో ఈ గ్రామాల్లో సర్పంచ్ పదవులకు డిమాండ్ పెరిగింది.

ఏకగ్రీవం చేసుకుంటే రూ..30లక్షలు

నల్లగొండ నియోజకవర్గంలో గ్రామపంచాయతీలు ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రూ.10లక్షల నజరానాతోపాటు, తాను మరో రూ.20లక్షల నిధులు అందిస్తానని మంత్రి వెంకటరెడ్డి హామీఇచ్చారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఇక్కడ నిధుల వరద ఉంటుందని, అభివృద్ధి పనులు జరుగుతాయని, సర్పంచ్‌గా గెలిస్తే పేరు, ప్రతిష్టలతో పాటు ఆర్థికంగానూ బలపడవచ్చనే నమ్మకంతో పలువురు గ్రామనాయకులు సర్పంచ్ పదవులకు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. అధికార కాంగ్రెస్ నుంచే ఒక్కో గ్రామంలో ముగ్గురు, నలుగురు అభ్యర్థులు పోటీపడుతుండడం ఇక్కడ ఆ పదవికి ఉన్న క్రేజ్‌ని తెలియజేస్తోంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు సైతం అన్ని పంచాయతీల్లో పోటీకి సిద్ధమై నామినేషన్లు వేశారు. బీజేపీ, సీపీఎం, సీపీఐ సైతం బలమున్నచోట బరిలో ఉండేందుకు సిద్ధమయ్యారు. మునుగోడు నియోజకవర్గంలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ సైతం పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నకిరేకల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో సర్పంచ్ పదవులకు పోటాపోటీ నెలకొనడంతో ఎమ్మెల్యేకు, ఇతర ప్రధాన నేతలకు వారిని బుజ్జగించడం సవాల్‌గా మారింది. నల్లగొండ, చండూరు డివిజన్లలోని మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో కొందరు సర్పంచ్ అభ్యర్థులు బుజ్జగింపులతో సర్దుబాటుకు వచ్చి ఉపసంహరణకు అంగీకరిస్తుంటే, మరికొందరు పార్టీ మారి పోటీకి సిద్ధమయ్యారు. ఇంకొందరు స్వతంత్ర అభ్యర్థులుగానైనా పోటీచేసి తీరుతామని చెబుతున్నారు. ఒకేగ్రామంలో పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు నామినేషన్లు వేసిన అభ్యర్థులను మండల, జిల్లా నాయకులు బుజ్జగిస్తున్నారు.

ఎన్నికలకు ఆటంకం కలిగిస్తే చర్యలు



అడవిదేవులపల్లిలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

అడవిదేవులపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలకు ఆటంకం కలిగించినా వారిపై చట్టపరంగా చర్యలు తీసకుంటామని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన అడవిదేవులపల్లి, చిట్యాల, బాల్నెపల్లి, బంగారికుంటతండాల్లో మంగళ వారం ఆయన పర్యటించారు. గ్రామస్థులతో, ఎన్నికల అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అందరు సహకరించాలన్నారు. ఎవరైనా ఓటర్లకు మద్యం, డబ్బు ఇతర ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో గొడవలు సృష్టించినా, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ శేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పెద్దఅడిశర్లపల్లి, నేరేడుగొమ్ము, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, నేరేడుగొమ్ము ఎస్ఐ నాగేంద్రబాబు హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ దృష్టా రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లడం, మద్యం తరలించడం, ఓటర్లను ప్రలోభ పెట్టే ఇతర చర్యలకు పాల్పడొద్దని సూచించారు. కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీస్ నిఘా వ్యవస్థలు అప్రమత్తంగా ఉన్నాయని అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సాఫీగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

చింతపల్లి: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని తీదేడు(వెంకటంపేట)లో ప్రజలతో కలిసి ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. ఈ నెల 17న నిర్వహించే ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉన్నందున్న అక్రమంగా డబ్బులతో పాటు మద్యం తరలించిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.